PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 11 | విజయవాడ, సోమవారం 11 ఆగస్టు 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 11 August 2025 | Rs

821 పిఎసిఎస్ సొసైటీలకు చైర్మన్ల నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రస్తుతం పర్సన్ ఇన్‌ఛార్జుల పాలనలో ఉన్న 821 ప్రాథమిక వ్యవసాయ కో-ఆపరేటివ్ సొసైటీలకు ప్రభుత్వం నూతన ఛైర్మన్లను నియమించింది. ఈ మేరకు ఆదివారం జిఓ ఆర్‌టి నెంబరు 669ని విడుదల చేసింది. ఈ కమిటీలు వచ్చే ఏడాది జనవరి 30 వరకు లేదా ఎన్నికలు జరిగే వరకు పనిచేస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొంది.



సంప్రదాయ ఆయుధాలతో ర్యాలీ చేస్తున్న గిరిజనులు

'హైడ్రో'పై ఆదివాసీల ఆగ్రహం

- గుట్టుచప్పుడు కాకుండా పాతిన దిమ్మలను ధ్వంసం చేసి నిరసన

2

వర్ష బీభత్సం

- తాడిపత్రిలో తెగిన రోడ్లు, పొంగిన వాగులు, వంకలు
- రాకపోకల బంద్
- అల్లూరి జిల్లాలో కుంగిన కాజ్‌వే

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం రాత్రి, ఆదివారం భారీ వర్షాలు కురిశాయి. అనంతపురం జిల్లాలో సర్వీసు రోడ్డు కొట్టుకుపోయింది. అల్లూరి జిల్లాలో కుంగిన కాజ్‌వే కుంగిపోయింది. వైఎస్ఆర్ కడప జిల్లాలోని పెన్నా నదిలో ముగ్గురు చిక్కుకుపోయారు. వారిని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. ఆదివారం అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలో 72.2 మిల్లీమీటర్లు, నార్పలలో 66.4 మిల్లీమీటర్లు, పుట్లూరులో 58.8 మిల్లిమీటర్లు, యల్లనూరులో 56.8 మిల్లీమీటర్లు, శెట్టూరు 55.8 మండలంలో మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం రాత్రి నుంచి కురిసిన ఏకధాటి వర్షానికి తాడిపత్రి మండల పరిధిలోని వాగులు వంకలు నిండి పొంగిపొర్లాయి. కొన్ని రహదారులు తెగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రావెల్‌తో నిండిన కొండగుట్టలు విరిగిపడ్డాయి. తాడిపత్రి-నంద్యాల ప్రధాన రహదారిపై బుగ్గ సమీపంలో కొత్తగా 544-డి హైవే బ్రిడ్జ్ నిర్మించిన సర్వీస్ రోడ్డు వంక ఉధృతికి



అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలోని బుగ్గ సమీపంలో తెగిపోయిన సర్వీసు రోడ్డు

కొట్టుకుపోయింది. దీంతో, ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి రాకపోకలు స్తంభించడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాడిపత్రి నుండి ఓబులేసుకోన, ఊరు చింతల వెళ్లే మార్గంలో ఆవుల తిప్పయిపల్లి గ్రామం వద్ద వంకకు నీరు అధికంగా చేరడంతో ఆ దారిలో వెళ్తున్న ఓ జీపు నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తమై జీపు దిగిపోవడంతో ప్రాణనష్టం తప్పింది. మండల పరిధిలోని ఆలూరు కోననందులో గ్రావెల్ మట్టి వర్షపు నీటికి కరిగి కొండచరియలు విరిగిపడ్డాయి. కింద పార్కు చేసి ఉన్న వాహనాలకు గ్రావెల్ మట్టి పేరుకుపోయింది. అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ సమీపంలోని దేవరకోనకు వర్షపు నీరు అధికంగా రావడంతో అక్కడ జలపాతం ఉధృతంగా మారింది. మండల పరిధిలోని చిన్న, పెద్ద వంకలు వాగులు నీటితో నిండిపోయాయి. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పెన్నా నది పరవళ్లుతొక్కుతోంది. శ్రీసత్యసాయి జిల్లాలోనూ భారీ వర్షాలు పడ్డాయి. చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లిలో వంకలు పొంగడంతో రహదారి, కల్వర్టులు దెబ్బతిని ఐదు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్.పురం మండలంలోని అన్నవరం వాగుపై నిర్మించిన కాజ్‌వే ఆదివారం కుంగిపోయింది. దీంతో, 40 గ్రామాల ప్రజలు మళ్లీ ఇబ్బందులు పడనున్నారు. కాజ్‌వేను నాసిరకంగా నిర్మించడం వల్లే కొద్దిపాటి వర్షానికే కుంగిపోయిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూలిన కాజ్‌వేను సిపిఎం ఎంపిపి కారం లక్ష్మి, మండల కార్యదర్శి పులి సంతోష్ మిగతా 2లో

డిస్కమ్‌లపై 'కుసుమ్' భారం

- యూనిట్‌కు 3.19లతో సోలార్ విద్యుత్ ఒప్పందాలు
- మిగులులో ఉన్నా అధిక ధరకు
- త్వరలో ఎపిఇఆర్‌సి ముందుకు పిపిఎలు

2



రాయలసీమలో 6 లక్షల ఎకరాలకు సాగు నీరందించే హంద్రీ - నీవా ప్రాజెక్టులో కృష్ణమ్మ పరవళ్లు చూసి తన మనసు పులకరిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో డ్రోన్ ద్వారా చిత్రీకరించిన హంద్రీ - నీవా వీడియోను పోస్టు చేశారు. (వార్త 2లో)



సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

కార్పొరేట్‌ల కోసమే ...

బలవంతపు భూ సేకరణ, భూసమీకరణలపై వి.శ్రీనివాసరావు సామాజిక అధ్యయనం చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కార్పొరేట్, పెట్టుబడిదారులకు లబ్ధిచేకూర్చేందుకే బలవంతపు భూ సేకరణ చేస్తున్నారని రైతు సంఘం రాష్ట్ర పూర్వ కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. 2013 భూ సేకరణ, పునరావాసం చట్ట ప్రకారం పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం రైతులు, పేదల ఆమోదంతోనే భూ సేకరణ చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ప్రభుత్వాలు బలవంతపు భూసేకరణ చేపట్టడాన్ని ఆయన తప్పుపట్టారు. విజయవాడ బందరు రోడ్డులోని ఎంబివికెలో ఆదివారం బలవంతంపు భూ సేకరణకు వ్యతిరేకంగా హైకోర్టు న్యాయవాధులు, నిర్వాసితులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అధ్యక్షత వహించారు. చర్చా కార్యాక్రమానికి ముఖ్య అతిధిగాహాజరైన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమలు, ప్రాజెక్టుల పేరుతో గత పదేళ్ళలో రాష్ట్రంలో భూ సేకరణ, భూ సమీకరణ ద్వారా సేకరించిన భూములు ఎన్ని ఎకరాలు? కార్పొరేట్లకు కేటాయించిన భూములెన్ని? ఆయా పరిశ్రమల ద్వారా స్థానికులకు దక్కిన ఉద్యోగాలెన్ని? నిర్వాసితులకు పరిహారం, పునరావాసం లెక్కలపై సామాజిక అధ్యయనం చేయిస్తే ప్రభుత్వ డొల్లతనం బయట పడుతుందని అన్నారు. పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం రైతులు, పేదల ఆమోదంతోనే భూ సేకరణ చేయాలని, పూర్తినష్టపరిహారం, పునరావాసం కల్పించిన తర్వాతనే ప్రాజెక్టు పనులు కల్పించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారుల కోసం బలవంతంగా భూములు లాక్కోవద్దన్నారు. గత పదేళ్లలో ప్రాజెక్టుల నిర్మాణం కోసం 18 జిల్లాల్లో 1,91,472 ఎకరాల భూములను రైతుల వద్ద నుంచి బలవంతంగా తీసుకున్నారని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టాన్ని పాలకపక్షాలు తుంగలో తొక్కాయని ఆయన విమర్శించారు. ఇవి కాక మరో లక్ష ఎకరాలకు ప్రభుత్వం నోటీసులిచ్చిందన్నారు. ముఖ్యంగా భోగాపురం ఎయిర్‌పోర్టు, వంశధార, పోలవరం, గండికోట, వాన్‌పిక్, లేపాక్షిహబ్, సోలార్, గ్రీన్‌ఎనర్జీ, పోర్టుల పేరుతో సేకరించారన్నారు. అంతే కాకుండా కారిడార్‌లు, ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్లు, సోలార్, బల్క్‌డ్రగ్, ఎస్ఇజడ్‌లు, హైవేలు, అమరావతి రాజధాని పేరుతో లక్షలాది ఎకరాలు భూములు సేకరించారని విఎస్ఆర్ పేర్కొన్నారు. భూములిచ్చిన రైతులకు న్యాయం మిగతా 2లో



మల్లికార్జున ఫొటోతో ఆయన భార్య వరలక్ష్మి, కుమార్తె

'అనంత' విషాదం

- 19 నెలల్లో 95 మంది రైతుల ఆత్మహత్య
- పరిహారం అందక దుర్భరంగా మారిన బతుకులు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

అత్యల్ప వర్షపాతం కలిగిన అనంతపురం జిల్లాలో వ్యవసాయం జూదంగా మారింది. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాక అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అప్పులు తీర్చే మార్గం కనిపించక ఆత్మహత్యకు పాల్పడుతున్నాడు. ప్రభుత్వ సాయం అందకపోవడంతో మృతుల కుటుంబ సభ్యుల జీవన పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. 2024 నుంచి 2025 జులై వరకూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 95 మంది రైతులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో 50 మంది 2024లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. 2015 జనవరి ఒకటి నుంచి జులై నెలాఖరు వరకూ 45 మంది ఆత్మహత్య చేసుకున్నారు. నెలకు సగటున ఐదుగురు చొప్పున అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారిలో ఐదుగురి కుటుంబాలకు మాత్రమే పరిహారం అందినట్లు సమాచారం. మిగిలిన 90 కుటుంబాలు పరిహారం కోసం ఎదురు చూస్తున్నాయి. ఆత్మహత్య చేసుకున్న ఏ రైతు కుటుంబాన్ని కదిపినా వారి కష్టాలు బాధలు కన్పిస్తున్నాయి. కుటుంబ పోషణ భారం వారి భార్యలపై పడింది. రైతుల కుటుంబాల పరిస్థితిని 'ప్రజాశక్తి' పరిశీలించింది.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణం పరిహారం అందివ్వాలి. ఇప్పటికే ఆ కుటుంబాలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నాయి. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల్లో చదువుతున్న పిల్లల విద్య కొనసాగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రైతులకు రుణ విముక్తులు చేసి ఆత్మహత్యల నుంచి రక్షించాలి.

-చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

చేనేత ఆదుకోలేదు... వ్యవసాయమూ నిలబెట్టలేదు

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో బుక్కరాయసముద్రం మండలం ఉంది. ఈ మండలంలోని దయ్యాలకుంటపల్లి గ్రామంలో గిద్దలూరు మల్లికార్జునకు మూడున్నర ఎకరాల భూమి ఉంది. ఖాళీ సమయంలో తన భార్య వరలక్ష్మితో కలసి ఇంట్లో మగ్గం నేసేవారు. చేనేత ద్వారా కుటుంబానికి తగినంత ఆదాయం సమకూరేది కాదు. వ్యవసాయం ద్వారానైనా ఆదాయం వస్తుందని మెట్ట వ్యవసాయం కింద పంటలు సాగు చేసేవారు. వర్షాలు సకాలంలో పడక, పంట దిగుబడులు రాక నష్టపోతుండేవారు. బోరు బావి వేస్తే సాగునీటి వసతి ద్వారా ఉద్యాన పంటలు సాగు చేస్తే ఆదాయం పెంచుకోవచ్చని ఆయన భావించారు. ఒక చోటు బోరు వేయించినా నీరు పడలేదు. ఆ తర్వాత మరో మూడు బోర్లు తవ్వించినా అదే పరిస్థితి ఎదురైంది. నాలుగు బోర్ల తవ్వకానికి, పంటల సాగుకు రూ.20 లక్షలకుపైగా అప్పులు చేశారు. ఇందులో బ్యాంకులో తీసుకున్న అప్పు రూ.రెండు లక్షలకుపైగా ఉంది. తన భార్య బంగారం తాకట్టు పెట్టి నాలుగు లక్షల రూపాయలు రుణం తీసుకున్నారు. తక్కిన మొత్తాన్ని వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తెచ్చారు. అప్పులు తీర్చే మార్గం కనిపించక గతేడాది సెప్టెంబరులో విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేరుకున్నారు. ఇప్పుడు ఆ కుటుంబ భారాన్ని మోసే బాధ్యత ఆయన భార్య వరలక్ష్మిపై పడింది. ఆమె తన ఇద్దరు పిల్లలను మిగతా 2లో

'ఎస్ఐఆర్' మోసమా?

సిన్హా మోసం చేశారా?

- బీహార్ డిప్యూటీ సిఎంకు రెండుచోట్ల ఓటు ఎందుకు?
- నిలదీసిన ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్



బీహార్ డిప్యూటీ సిఎంకు రెండుచోట్ల నమోదైన ఓటు వివరాల జాబితాను చూపుతున్న తేజస్వి యాదవ్

పాట్నా : 'ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ మొత్తం మోసపూరితంగా చేసిందా? లేక బీహార్ డిప్యూటీ సిఎం విజయ్‌కుమార్ సిన్హా మోసం చేశారా?' అని బీహార్ ప్రతిపక్ష నేత, ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ ప్రశ్నించారు. పాట్నాలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిగా మోసపూరితంగా ఉందని అన్నారు. బిజెపికి సహాయపడే సాధనంగా ఇసిఐ మారకూడదని చెప్పారు. విజయ్ కుమార్ సిన్హాకు పాట్నాలోని బంకిపూర్ అసెంబ్లీ స్థానంలోనూ, లఖిసరాయ్ అసెంబ్లీ స్థానంలోనూ వేర్వేరు వయసులతో ఓటరుగా నమోదై ఉన్నారని తెలిపారు. ఒక నియోజకవర్గంలో వయసు 57 అని, మరో నియోజకవర్గంలో 60 అని నమోదైందని చెప్పారు. 'కొత్త ఓటర్ల జాబితా అన్ని పార్టీల జిల్లా అధ్యక్షులకు ఇచ్చారు. ఈ జాబితాలలో రెండు చోట్ల నమోదై ఉంది. ఇప్పుడు ఎవరు మోసం చేస్తున్నారు? ప్రజలు దీనిని తెలుసుకోవాలి' అని అన్నారు. 'వేర్వేరు దశల్లో జరిగిన రెండు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల్లోనూ ఓటు వేసేందుకు సిన్హా రెండుచోట్ల ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేశారా? ఆయన వ్యక్తిగతంగా సంతకం చేయకపోతే, నకిలీ సంతకాల ఆధారంగా రెండు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల కమిషన్ రెండు వేర్వేరు ఓట్లను సృష్టించిందా?' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇసిఐ వెబ్‌సైట్‌లోని రెండు ఎపిక్ నెంబర్లను మీడియాకు చూపించారు. సిన్హా నుంచి బూత్ లెవెల్ అధికారులు రెండు ప్రదేశాల్లోనూ సంతకాలు తీసుకుని నమోదు చేసి ఉండవచ్చునని తేజస్వి చెప్పారు. ఎన్నికల కమిషన్, పాట్నా, లఖిసరాయ్ జిల్లా యంత్రాంగాలు ఈ అంశంపై ఏమి చేస్తాయని ప్రశ్నించారు. తనకు ఆగమేఘాలపై నోటీసు జారీ చేసిన ఎన్నికల యంత్రాంగం ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తుందని నిలదీశారు. బిజెపికి అనుకూలంగా ఇసిఐ వ్యవహరిస్తోందని విమర్శించారు. విజయ్‌కుమార్ సిన్హా దోషి అయితే రాజీనామా చేయాలని, ఇసిఐ దోషి అయితే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా పురుషుల కంటే అత్యధికంగా మహిళల ఓట్లను తొలగించారని తెలిపారు.

లఖిసరై నుంచి ఓటు తొలగించాలని దరఖాస్తు చేశా : విజయ్ సిన్హా


లఖిసరై నియోజకవర్గం నుంచి తన ఓటు తొలగించాలని దరఖాస్తు చేసుకున్నానని, ఇందుకు సంబంధించి తన దగ్గర ఆధారాలున్నాయని డిప్యూటీ సిఎం విజయ్ సిన్హా చెప్పారు. గతంలో తన కుటుంబం ఓట్లన్నీ పాట్నాలో ఉన్నాయని, 2024 ఎన్ని కల సమయంలో లఖిసరై అసెంబ్లీ నియోజక వర్గంలో చేర్చాలని దరఖాస్తు చేసుకున్నానని చెప్పారు.



ఇఆర్‌సిలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయా..?

- సుప్రీంకోర్టు సూటి ప్రశ్న
- ప్రజల కోసమే విద్యుత్ అని స్పష్టీకరణ
- నాణ్యమైన సరఫరా, అందుబాటులో ధరలు
- ఇవే ఇఆర్‌సిల విధులు

6



నేటి నుంచి ఎఫ్‌ఎ-1 పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫార్మటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఎ)-1 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 13వ తేదీ వరకు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు 14వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. 1 నుంచి 8వ తరగతి విద్యార్థుల వరకు ఉదయం 9:30 నుంచి 10:45 గంటల వరకు ఒక సబ్జెక్టు, మధ్యాహ్నం 1:15 గంటల నుంచి 2:30 గంటల వరకు మరో సబ్జెక్టు ఉంటుంది. 9, 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు ఒక సబ్జెక్టు, మధ్యాహ్నం 2:45 గంటల నుంచి 4 గంటల వరకు మరో సబ్జెక్టు ఉంటుంది. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రశ్నాపత్రాలు స్కూల్ కాంప్లెక్స్‌ల వద్ద, ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రశ్నాపత్రాలు మండల రిసోర్స్‌పర్సన్ వద్ద ఉంటాయి.

వేతనాలు పెంచాల్సిందే...

- లేకుంటే నేటి నుంచి షూటింగ్‌లు బంద్ చేస్తాం
- ఫిల్మ్ ఫెడరేషన్ కార్యాలయం వద్ద సినీ కార్మికుల ఆందోళన



ఫిల్మ్ ఫెడరేషన్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన సినీ కార్మికులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తమ వేతనాలు పెంచాలని కోరుతూ 24 క్రాఫ్ట్సుకు చెందిన సినీ కార్మికులు నిర్మాతలకు అల్టిమేటం జారీ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను అంగీకరించకుంటే సోమవారం నుంచి సినిమా షూటింగ్‌లన్నీ బంద్ చేస్తామని ప్రకటించారు. సినీ కార్మికుల డిమాండ్లపై గత రెండు రోజులుగా కార్మిక సంఘాల నాయకులకు, నిర్మాతలకు మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కి రాకపోవడంతో ఫిలింనగర్‌లోని ఫిల్మ్ ఫెడరేషన్ కార్యాలయం ముందు 24 క్రాఫ్ట్సుకు చెందిన సినీ కార్మికులు ఆదివారం ఆందోళనకు దిగారు. వేతనాలు పెంచాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొంతమందికి వేతనాలు పెంచుతామని లీకులిస్తూ కార్మికుల ఐక్యతను దెబ్బతీసే కుట్రలు మానుకోవాలని, కార్మికులందరికీ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షులు వల్లభనేని అనిల్‌కుమార్ మాట్లాడుతూ చర్చలు ఫలించకపోతే సోమవారం నుంచి సినిమా చిత్రీకరణలు పూర్తిగా నిలిపివేస్తామన్నారు. ఇప్పటికే షెడ్యూల్ ఉంటే ఆ నిర్మాతలతో మాట్లాడి ఒకట్రెండు రోజులు సమయం ఇచ్చి తర్వాత ఆ చిత్రీకరణల చిత్రీకరణ కూడా నిలిపివేస్తామని తెలిపారు. నిర్మాత విశ్వప్రసాద్ ఇచ్చిన నోటీసులపై స్పందిస్తూ, ఆయన ఎందుకు పంపారో తెలియదన్నారు. ఆయనకు నేరుగా పంపే అధికారం లేనందున ఫిల్మ్ ఛాంబర్‌కు నోటీసులు పంపిస్తామని చెప్పారు. కోర్టు తీర్పు వచ్చే వరకు విశ్వప్రసాద్ సినిమా షూటింగ్‌లకు హాజరు కాబోమని తెలిపారు. ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయం మేరకే తుది కార్యాచరణ ఉంటుందని ఫెడరేషన్ నేతలు స్పష్టం చేశారు.

ప్రశ్నాపత్రాలు పాఠశాలలకు చేర్చాలి

- టీచర్స్ గిల్డ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫార్మటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఎ)-1 ప్రశ్నాపత్రాలను పాఠశాలల వద్దకు అందించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి చిట్టిబాబు, ఎల్‌కె చిన్నప్ప ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలు చాలా ఉన్నాయని, కొన్ని పాఠశాలలు మండల కేంద్రానికి 20-30 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని తెలిపారు. పాఠశాలలను వదిలి పరీక్ష పేపర్ల కోసం అంతదూరం వెళ్లేందుకు సమయం సరిపోదని పేర్కొన్నారు. సిఆర్‌పిల ద్వారా ప్రశ్నాపత్రాలు పాఠశాలలకు సరఫరా చేయాలని కోరారు. నూతన విధానంలో జరుగుతున్న ఎఫ్‌ఎ-1 పరీక్షలకు సంబంధించి మార్పులు చేయాలని వైఎస్‌ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వి రెడ్డి శేఖర్ రెడ్డి మరో ప్రకటనలో కోరారు. నూతన పరీక్ష విధానంపై ఇప్పటి వరకు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించలేదని పేర్కొన్నారు.



ప్రజాస్వామ్యానికి పాతర

- మాజీ సిఎం వైఎస్ జగన్ విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్రజా స్వామిక, అరాచక వాది అని వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ విమర్శించారు. రౌడీ రాజకీయా లు తప్ప ప్రజల అభిమానాన్ని, వారి మనసును గెలుచుకుని రాజకీయాలు చేసే వ్యక్తి కాదని ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొ న్నారు. ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి పాతర వేస్తూ బరితెగింపు రాజకీ యాలు చేస్తున్నారని విమర్శించారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగనీయకుండా, కుట్రపూరితంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు, ఆయన అడుగులకు మడుగులొత్తే కొంతమంది అధికారులు, టిడిపి అరాచక గ్యాంగులు, కొంతమంది పోలీసులు ముఠాగా ఏర్పడి ఎన్నికను హైజాక్ చేయడానికి దుర్మార్గాలు, దారుణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

'అనంత' విషాదం

(మొదటిపేజి తరువాయి)

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నారు. సాయం చేసేవారు లేక చేనేత పనిని విడిచిపెట్టారు. కుట్టుమిషన్ నేర్చుకుని నెలకు మూడు వేల నుంచి నాలుగు వేల రూపాయల వరకు ఆదాయం పొందుతున్నారు. ఇప్పటికీ ఈ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారమూ అందలేదు

ముగ్గురు పిల్లల భారం ఆమెపైనే...

బుక్కరాయసముద్రం మండలంలోని చెన్నంపల్లి గ్రామానికి రైతు సి.నరసింహుడుకు మూడున్నర ఎకరాల భూమి ఉంది. వ్యవసాయం కోసం అప్పులు చేశారు. ఇవి తీర్చే మార్గం కనిపించక గతేడాది అక్టోబరులో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. ఇద్దరు అమ్మాయిల్లో ఒక అమ్మాయి ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇటీవల ఎంసెట్ రాశారు. తండ్రి చనిపోయిన శోకంలో విద్యపై దృష్టి సారించలేకపోవడంతో ర్యాంకు ఎక్కువగా వచ్చింది. దీంతో, ప్రభుత్వ కళాశాలలో సీటు వచ్చే అవకాశం లేదు. ప్రయివేటు కళాశాలలో చేరేందుకు డబ్బుల్లేక ఆ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. మరో అమ్మాయి తాడిపత్రి కస్తూరిబా కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. కుమారుడు పేరూరు ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. ముగ్గురు పిల్లలను ఉన్నత స్థితికి చేరాల్సిన సమయంలో తండ్రి చనిపోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కుటుంబ పోషణ అంతా నరసింహుడు భార్య సరస్వతిపై పడింది. ఆమె కూలి పనులకు వెళితేగానీ పూటగడవని పరిస్థితి ఉంది. ఈ కుటుంబానికి కూడా ఇంకా ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని సరస్వతి వేడుకుంటున్నారు. మల్లికార్జున, నరసింహుడు కుటుంబాలే కాదు... ఆత్మహత్య చేసుకున్న మిగిలిన రైతుల కుటుంబాల పరిస్థితి కూడా ఇదే విధంగానే ఉంది.

'హైడ్రో'పై ఆదివాసీల ఆగ్రహం

నిర్మాణ పనులు చేపడితే తరిమికొడతామని హెచ్చరిక

- ప్రాజెక్టు కోసం గుట్టుచప్పుడు కాకుండా పాతిన దిమ్మలు ధ్వంసం

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

తమ జీవితాలను ఛిద్రం చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులపై అల్లూరి జిల్లా ఆదివాసీలు భగ్గుమంటున్నారు. ఈ క్రమంలోనే అరకులోయ మండలం లోతేరు, ఇరగాయి పంచాయతీల పరిధిలో హైడ్రో పవర్ ప్రాజెక్టు ఎగువ డ్యామ్ నిర్మాణం కోసం నవయుగ కంపెనీ ప్రతినిధులు గుట్టుచప్పుడు కాకుండా పాతిన దిమ్మలను ఆదివారం పగలగొట్టారు. తొలుత వారంతా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో దూద్ కొండి గ్రామం నుంచి తమ సంప్రదాయ ఆయుధాలతో ర్యాలీ చేపట్టారు. తమ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసమని ఎవరైనా వస్తే తరిమి కొడతామంటూ నినాదాలు చేశారు. అక్కడ స్థానిక పీసా కమిటీ కార్యదర్శి స్వామి అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ.. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గుజ్జెలి, పెదకోట, చిట్టెంపాడు ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇస్తూ జిఒ 51ని జారీ చేసిందని తెలిపారు. వాటిలో గుజ్జెలిలో నిర్మించనున్న హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన ఎగువ డ్యామ్ నిర్మాణానికి డ్రోన్ కెమెరాతో ఇప్పటికే సర్వే నిర్వహించారన్నారు. అరకులోయ మండలం లోతేరు, ఇరగాయి పంచాయతీల పరిధిలో కాగువలస, దూద్‌కొండి, ముసిరిగూడ, దవడగూడ, మొర్రిగూడ, పొలిగుడ, అంటిపర్తి, తాంగులబెడ్డ గ్రామాల్లో నవయుగ కంపెనీ ప్రతినిధులు ప్రాజెక్టు నిర్మాణం కోసం దిమ్మలు పాతారని తెలిపారు. షెడ్యూల్ ఏరియాలో పీసా చట్టానికి విర్ధుంగా గ్రామసభ అనుమతి లేకుండా, 1/70 చట్టాన్ని ఉల్లంఘించి దిమ్మలు ఎలా పాతుతారని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు ఎగువ డ్యామ్ నిర్మాణం చేపడితే పైన తెలిపిన గ్రామాలతోపాటు విజయనగరం జిల్లా పరిధిలోని చిట్టిపురం, సదపి, తంగ్లం గ్రామాలకు చెందిన సుమారు 500 కుటుంబాలు, 14 వందల ఎకరాల జిరాయితీ భూములు, వేల ఎకరాల అటవీ భూములు, పంటపొలాలు, తోటలు, వన్యప్రాణులు జలసమాధి అవుతాయన్నారు. ప్రయివేటు సేవలో మునుగుతూ మోడీ, చంద్రబాబు, పవన్‌లు గిరిజనుల బతుకులను నాశనం చేయడం తగదన్నారు. పాడేరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభలో పాల్గొన్న సిఎం చంద్రబాబు మాట్లాడుతూ ఇక్కడి ప్రకృతిని మెచ్చుకుంటూ, మళ్లీ జన్మంటూ ఉంటే ఇక్కడే పుడతానని తెలిపారని, ఆదివాసీలపై అంత ప్రేమ ఉంటే హైడ్రో పవర్ ప్రాజెక్టులకు ఎలా అనుమతులు ఇచ్చారని నిలదీశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు, నాయకులు అప్పలస్వామి, కిల్లో బుజ్జిబాబు, పీసా కార్యదర్శి కిల్లో రామన్న, మంగళయ్య, బాబూరావు, గంగునాయుడు, సుబ్బారావు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం పాతిన దిమ్మలను ధ్వంసం చేస్తున్న గిరిజనులు

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

అదాని స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. సిపిఎం, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. స్మార్ట్ మీటర్లతో కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం, మహాలక్ష్మీపురంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల నెత్తిన భారాలు వేయడానికి ప్రయత్నిస్తోన్న టిడిపి కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. విశాఖలోని జివిఎంసి 69వ వార్డు పరిధి తుంగ్లంలో ర్యాలీ నిర్వహించారు. తోకాడలోని సమైఖ్య, సిరి, గ్రీన్ లైఫ్, స్వర్ణ సాయి అపార్టుమెంట్లకు చెందిన ప్రజలు ఆటోనగర్‌లోని ఎడిఇ ఆఫీస్ వరకు ప్రదర్శనగా వెళ్లి అక్కడ ధర్నా చేశారు. నంద్యాల జిల్లా పాములపాడు మండల కేంద్రంలో స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆటో జాతాను ప్రారంభించారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు.



నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం మహాలక్ష్మీపురంలో సిపిఎం నాయకుల నిరసన

కృష్ణమ్మ పరవళ్లతో పులకరిస్తోన్న మనసు

- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగు నీరందించే హంద్రీ-నీవా ప్రాజెక్టులో కృష్ణమ్మ పరవళ్లు చూసి తన మనసు పులకరిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పొందుపరిచారు. ప్రతి ప్రాజెక్టూ నిండేలా, ప్రతి చెరువుకూ నీరందేలా, చివరి భూములను సైతం తడిపేలా, అత్యధిక సామర్థ్యంతో హంద్రీ నీవా కాల్వల్లోని నీటి ప్రవాహాలు రైతన్నల ఆశలను, ఆకాంక్షలను తీరుస్తున్నాయని పేర్కొన్నారు. రికార్డు సయమంలో కాల్వల విస్తరణ చేపట్టిన కారణంగానే ఈ సీజన్‌లో చివరి భూములకు నీరందించాలనే తమ కల సాకారమవుతోందని తెలిపారు. రైతుల సంతోషం తమ సంకల్పానికి మరింత బలాన్నిస్తోందని పేర్కొన్నారు.

వర్ష బీభత్సం

(మొదటిపేజి తరువాయి)

కుమార్, నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, పోడియం శ్రీరామ్మూర్తి పరిశీలించారు.

పెన్నానదిలో చిక్కుకున్న యాత్రికులు రక్షించిన పోలీసు, అగ్నిమాపక సిబ్బంది

భారీ వర్షాల నేపథ్యంలో శనివారం వైఎస్‌ఆర్ కడప జిల్లా మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి నీటిని విడుదల చేశారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో జమ్మలమడుగు మండలం దానవులపాడు-సున్నపురాళ్లపల్లె మధ్య పెన్నా నదిపై వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో, కారులో ఆదివారం ప్రయాణిస్తున్న ప్రొద్దుటూరుకు చెందిన గోవర్ధన్ రెడ్డి, రామలక్ష్మమ్మ, ఓబులమ్మ చిక్కుకుపోయారు. వారిని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వారిని రక్షించారు. తిరుపతిలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురవడంతో నగరంలోని పలు రోడ్లు జలమయ్యాయి. మురుగు కాలువల్లోని చెత్తాచెదారం రోడ్లపైకి రావడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పశ్చిమగోదావరి జిల్లాలో మొగల్తూరు, పాలకొల్లులో భారీ వర్షం కురిసింది. నంద్యాల జిల్లా వ్యాప్తంగా మోస్తారు వర్షం పడింది. సంజామల మండలంలో భారీ వర్షానికి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. సంజామల-కానాల గ్రామాల మధ్యన ఉన్న పాలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అల్లూరి జిల్లా జికె.వీధి మండలం, అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలో వర్షం కురిసింది.

కార్పొరేట్‌ల కోసమే ...

(మొదటిపేజి తరువాయి)

చేయకుండా, వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదన్నారు. పోలవరం నిర్వాసితులకు నేటికీ న్యాయం జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూముల్చిన రైతులకు ఉపాధిలేక పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. హైకోర్టు అడ్వకేట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 30 ప్రాజెక్టుల్లో ఎక్కడా 2013 భూసేకరణ చట్టం ప్రకారం సేకరణ జరగలేదన్నారు. తాజాగా నెల్లూరు జిల్లా కరేడులో చట్టాలన్నీ తుంగలో తొక్కి గ్రామ సభలు నిర్వహించకుండా రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండా భూములు తీసుకుంటున్నారన్నారు. ఆ గ్రామాన్ని సందర్శించడానికి వెళ్లిన పౌర హక్కుల నేతలు, అడ్వకేట్స్‌ను అడ్డుకున్నారని, ఇదేనా ప్రజాస్వామ్యమని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో చట్టాలను తుంగలో తొక్కడం అత్యంత దుర్మార్గమన్నారు. రైతులు చేసే పోరాటాలకు అండగా ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ నిలబడతుందన్నారు. రైతులకు వ్యవసాయ కార్మికులకు సరైన పరిహారం, పునరావాసం కల్పించిన తర్వాతనే భూముల జోలికి వెళ్ళాలని అలా కాకుండా ప్రభుత్వాలు ముందుకు వెళితే వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున తిరగబడాలన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా 2013 చట్టంలో కీలకమైనటువంటి సోషల్ ఇంపాక్ట్ సర్వే పునరావాసాన్ని వదిలేసిచట్టాన్ని సవరించి రైతులకు తీవ్రమైన ద్రోహం చేస్తూ 2018లో చట్ట సవరణ చేశారని సుంకర రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ చర్చా వేదికలో కార్యాచరణ ప్రణాళికలను వివిధ జిల్లాల్లో జరుగుతున్న భూసేకరణ గురించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, వివరించారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల25న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు నిరసనలు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, హైకోర్టు న్యాయవాదులు మాధవరావు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విదేశీ అక్రమ వలసదారుల తొలగింపుపై... ఇసి వాదన అర్థరహితం

- పార్లమెంటరీ కమిటీ నివేదికలో బయటపడిన వాస్తవం

న్యూఢిల్లీ : బీహార్‌తో ప్రారంభించి దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను చేపట్టబోతున్నట్లు ఎన్నికల సంఘం జూన్ 24న ఒక ప్రకటన చేసింది. అందుకు అనేక కారణాలు చూపింది. విదేశీ అక్రమ వలసదారుల పేర్లు ఓటర్ల జాబితాలలో ఉండడం వాటిలో ఒక కారణం. ఈ వాదనలో ఏ మాత్రం పస లేదని కొన్ని పరిణామాలు రుజువు చేస్తున్నాయి. సిబ్బంది, ప్రజా సమస్యలు, చట్టం - న్యాయంపై ఏర్పడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 2023 ఆగస్టు 4న తన నివేదికలో ఓ సిఫార్సు చేసింది. భారత పౌరులు కానివారు తమ ఆధార్‌ను ఓటర్ ఐడితో అనుసంధానం చేయకుండా చూడడానికి ఎన్నికల కమిషన్ ఒక చట్టబద్ధమైన యంత్రాంగంతో ముందుకు రావాలని సూచించింది. 2021లో ఎన్నికల చట్టాలకు సవరణలు జరిగిన తర్వాత ఎన్నికల కమిషన్ ఓటర్ల ఆధార్ నెంబర్లను సేకరించడం మొదలు పెట్టింది. 2022లో ఆ ఆధార్ నెంబర్లను ఓటర్ల ఫొటో గుర్తింపు కార్డులతో (ఎపిక్) అనుసంధానం చేసేందుకు ఈ ప్రక్రియ చేపట్టింది. అది తమ ఆధార్ నెంబర్లను ఇవ్వాలా వద్దా అనే దానిపై ఓటర్లదే తుది నిర్ణయం. అంటే అది స్వచ్ఛందమే. భారత పౌరులు కాని వారి ఎపిక్‌ను ఆధార్‌తో అనుసంధానం చేయడంపై 2023 నివేదికలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఆధార్ కార్డులు కలిగి ఉన్నప్పటికీ దేశ పౌరులు కాని వారిని ఓటర్ల జాబితాలో చేర్చకుండా ఉండడానికి కేంద్ర ఎన్నికల సంఘం చట్టబద్ధమైన నిబంధనను కానీ లేదా ప్రత్యామ్నాయ యంత్రాంగాన్ని కానీ రూపొందించాలని సూచించింది. తన నివేదికపై న్యాయ మంత్రిత్వ శాఖ, కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలను వివరిస్తూ బిజెపి ఎంపీ బ్రిజ్ లాల్ నేతృత్వంలోని స్టాండింగ్ కమిటీ శుక్రవారం నాడు పార్లమెంటుకు నివేదిక అందజేసింది.

ఆధార్ కార్డు ఉన్నప్పటికీ దేశ పౌరుడు కాని వ్యక్తిని ఓటరుగా నమోదు చేసేందుకు అనుమతించబోమని ఎన్నికల కమిషన్ గత ఏడాది జనవరి 17న కమిటీకి పంపిన సమాధానంలో స్పష్టం చేసింది. ఇసి సమాధానంపై సంతృప్తి వ్యక్తం చేసిన కమిటీ ఆ తర్వాత ఎలాంటి సిఫార్సులు చేయలేదు. మరి అలాంటప్పుడు దేశ పౌరులు కాని వారిని ఓటర్ల జాబితాల నుంచి తొలగించేందుకు సర్‌ను చేపట్టామని ఇసి చేస్తున్న వాదన అర్థరహితమని స్పష్టమవుతోంది.

ఉత్తరాంధ్రలో దెబ్బతిన్న పర్యావరణం

- జెవివి రాష్ట్ర అధ్యక్షులు ఎం గేయానంద్

ప్రజాశక్తి-కంటోన్మెంట్ (విజయనగరం జిల్లా)



ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యావరణం పూర్తిగా దెబ్బతిందని, దీనిని రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం చేస్తామని జనవిజ్ఞాన వేదిక (జెవివి) రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎం గేయానంద్ తెలిపారు. విజయనగరంలోని ఎన్‌జిఒ హోంలో ఆదివారం నిర్వహించిన జెవివి జిల్లా మహాసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గేయానంద్ విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ 13, 14 తేదీల్లో విజయనగరంలో జెవివి రాష్ట్ర మహాసభ పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహాసభకు 26 జిల్లాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయడానికి జెవివి కృషి చేస్తోందన్నారు. ఉత్తరాంధ్రలో దెబ్బతిన్న పర్యావరణం గురించి రాష్ట్ర వ్యాప్తంగా చర్చించేందుకు ఈ మహాసభ దోహదపడుతుందని వివరించారు. తద్వారా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అభివృద్ధిని, ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. 'అభివృద్ధికి తూనికలు ఏమిటి' అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు.. రాష్ట్ర మహాసభలో ఉపన్యాసిస్తారన్నారు. పర్యావరణ సంస్కృతిపై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతారని తెలిపారు. ప్రొఫెసర్ నాగేశ్వరరావు, వి బాలసుబ్రమణ్యం మహాసభకు హాజరవుతారని చేప్పారు. రాష్ట్ర మహాసభకు హాజరయ్యే ప్రతినిధులకు ఆహ్వాన కమిటీ ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి రాజగోపాల్, గిరిధర్, విజయనగరం జిల్లా అధ్యక్షులు వెంకటరావు పాల్గొన్నారు.



నాగార్జున సాగర్ 8 గేట్లు ఎత్తి నీటి విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో 8 గేట్లు ఎత్తి నీటిని కిందకు వదులుతున్నట్టు అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు గాను 590 అడుగులకు చేరుకోవడంతో నిండుకుండలా కనిపిస్తుంది. సాగర్ డ్యాం 26 క్రస్ట్‌గేట్ల పైనుంచి నీరు పొంగిపొర్లుతుండటంతో అధికారులు ఆదివారం తెల్లవారుజామున రెండు గేట్లను ఐదడుగుల మేరకు ఎత్తి దిగునకు నీటి విడుదల చేశారు. మధ్యాహ్నం నుంచి నాలుగు గేట్లను ఐదడుగుల మేరకు ఎత్తగా, సాయంత్రం ఎనిమిది గేట్లను ఐదు అడుగుల మేరకు వ్యక్తి 64,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌కు శ్రీశైలం నుంచి వస్తున్న నీటి పరిమాణం కంటే రెట్టింపు పరిమాణంలో జలాశయం నుంచి బయటకు విడుదల చేస్తున్నారు.

ఆస్పత్రుల్లో ఖాళీలను భర్తీ చేస్తాం : పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు, చికిత్సలు, సిబ్బంది కొరతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని ముఖ్యమైన విభాగాలకు సంబంధించి వైద్యుల కొరత ఉందని, త్వరలోనే భర్తీ చేస్తామని తెలిపారు. ఆస్పత్రిలో కొన్ని పరికరాల కొరత ఉందని, వాటిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తెనాలి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసి.. రైల్వే స్టేషన్‌లో సదుపాయాలపై చర్చించారు. నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. అమృత్ భారత్ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం పెమ్మసాని తెనాలి నుంచి మంగళగిరి వెళుతుండగా మార్గ మధ్యలో రోడ్డు ప్రమాదానికి గురైన చినవడ్లపూడికి చెందిన వి.వెంకటేశ్వరరావు అనే వృద్ధుడిని తన వాహనంలో ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ప్రమాదంలో గాయపడి రోడ్డుపక్కన పడి ఉన్న వారిని స్థానికులు స్పందించి సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు నిలిపిన వారవుతామని పెమ్మసాని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

స్మగ్లర్ నాగదస్తగిరిరెడ్డి అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్ (వైఎస్‌ఆర్ కడప జిల్లా)

వైఎస్‌ఆర్ కడప జిల్లాలో లంకమల్ల అటవీ ప్రాంతంలో మోస్ట్‌వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్ ఇరగంరెడ్డి నాగ దస్తగిరిరెడ్డిని ఆకస్మిక దాడుల్లో పోలీసులు అరెస్టు చేశారు. అతనితో పాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు టన్ను బరువున్న 52 ఎర్రచందన దుంగలను, రెండు కార్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్‌పి ఇజి అశోక్ కుమార్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. శనివారం చాపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది కలిసి వాహనాలు తనిఖీ చేస్తూండగా కారులో ఎర్రచందనం దుంగలను గమనించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు నాగ దస్తగిరిరెడ్డి, ముదిరెడ్డి రామమోహన్ రెడ్డి, ఉమ్మనబోయిన కృష్ణయ్య, కాయలి శ్రీనివాసులు, బండ్రెడ్డి ఓబుల్ రెడ్డి, శనివారపు బాల గంగిరెడ్డిని అరెస్టు చేశారు. నాగ దస్తగిరిరెడ్డి గతంలో మోస్ట్ వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్‌గా సుమారు 86 ఎర్రచందనం కేసులు, 34 దొంగతనాల కేసులు ఉన్నాయి. మూడుసార్లు పీడీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి. ఆయన భార్య లాలుబీపైనా ఎర్రచందనం కేసులు ఉన్నాయి. ఆమె ప్రస్తుతం జైలులో ఉన్నారు.

డిస్కమ్‌లపై 'కుసుమ్' భారం

- యూనిట్‌కు 3.19లతో సోలార్ విద్యుత్ ఒప్పందాలు
- మిగులులో ఉన్నా అధిక ధరకు త్వరలో ఎపిఇఆర్‌సి ముందుకు పిపిఎలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల(డిస్కమ్‌ల)పై పిఎం కుసుమ్ భారం పడనుంది. ఈ పథకంలో సబ్సిడీ వస్తుందనే పేరుతో అధిక ధరకు విద్యుత్ ఒప్పందాలు చేసుకునేందుకు డిస్కమ్‌లు సిద్ధమయ్యాయి. ఉచిత విద్యుత్ వ్యవసాయం పేరుతో మినీ సోలార్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉన్నా అధిక ధరకు తీసుకునేలా ఖరారు చేసిన ఈ టెండర్లు త్వరలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఎపిఇఆర్‌సి) ముందుకు రానున్నాయి. ఈ ప్రాజెక్టులకు అవసరమైన సుమారు 6వేల ఎకరాల భూములను డిస్కమ్‌లు ఇప్పటికే గుర్తించాయి.రాష్ట్రంలో సుమారు 6,600 వ్యవసాయ ఫీడర్లు ఉండగా 19లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కుసుమ్ పథకం కింద 3,325 మెగావాట్లు(మెవా) మినీ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి వ్యవసాయానికి అందించాలని నిర్ణయించాయి.



మార్చిలో తొలిదశలో 1185 మెవాకు పిలిచిన టెండర్లను యూనిట్‌కు రూ.3.19ల నుంచి రూ.3.20ల మధ్య ఇటీవల ఖరారు చేశాయి. ఎకోరాన్ కంపెనీకి యూనిట్‌కు రూ.3.18లకు, వృద్ధిమాన్ కంపెనీకి రూ.3.19లు, భవ్య కంపెనీకి రూ.3.20ల చొప్పున టెండర్లను అప్పగించాయి. ఇందుకు సంబంధించిన పిపిఎలను త్వరలో ఎపిఇఆర్‌సి వద్దకు రానున్నాయి. ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని 9 సర్కిళ్లల్లో 610 మెవా ప్రాజెక్టుల ఏర్పాటుకు టెండర్లు పిలిచాయి. శ్రీసత్యసాయి, అనంతపురం, నంద్యాల, కర్నూలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప సర్కిళ్ల పరిధిలో 3055 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించాయి. సిపిడిసిఎల్ పరిధిలోని 355.50 మెవా ఉత్పత్తికి నాలుగు సర్కిళ్లల్లో 1842 ఎకరాలను గుర్తించాయి. ఇపిడిసిఎల్ పరిధిలో 220.30 మెవా ఏర్పాటుకు 1086.5 ఎకరాలు గుర్తించారు. సౌర విద్యుత్ బహిరంగ మార్కెట్‌లోనే తక్కువ ధరకే వస్తున్నా అధిక ధరకు పిపిఎలు చేసుకునేందుకు సిద్ధం కావడంపై విద్యుత్ నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మిగులు విద్యుత్ ఉన్న సమయంలో కొత్త ప్రాజెక్టులతో ఒప్పందాలు చేసుకోవడం వల్ల డిస్కమ్‌లపై భారాలు పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటి వరకు రాష్ట్ర గ్రిడ్ గరిష్ట డిమాండ్ 13 వేల మెగావాట్ల లోపే ఉంది. అది కూడా బాగా ఎండలు ఉన్న సమయంలోనే ఈ డిమాండ్ ఉంటుంది. ఇతర సమయాల్లో 10వేల మెవాలోపే డిమాండ్ ఉంటుంది. ఇప్పటికే డిస్కమ్‌లు 23వేల మెవాకు పిపిఎలు చేసుకున్నాయి. ఈ ఒప్పందాల నుంచి సుమారు 14వేల మెవా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. అంటే డిమాండ్‌కు అవసరమైన విద్యుత్ పోనూ ఇంకా మిగులు ఉంది. మెరిట్ ఆర్డర్ ప్రకారం జెన్‌కో ప్లాంట్లల్లో ఇప్పటికే కొన్ని సార్లు ఉత్పత్తిని నిలిపివేస్తున్న పరిస్థితి ఉంది.ఇలాంటి సమయంలో పిఎం కుసుమ్ పేరుతో అధిక ధరకు మరలా పిపిఎలు చేసుకునేందుకు డిస్కమ్‌లు సిద్ధమయ్యాయి. ఉదయం పూట బహిరంగ మార్కెట్‌లో సౌర విద్యుత్ యూనిట్ రూ.2లోపే అందుబాటులో ఉన్నా డిస్కంలు రూ.3.20లకు ఈ టెండర్లను ఖరారు చేయడం గమనార్హం.

'అడవితల్లి బాట' పనులు వేగవంతం : పవన్‌కల్యాణ్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'అడవితల్లి బాట' పనులను వేగవంతం చేయాలని, సవాళ్లు ఎదురైతే ప్రణాళికాబద్ధంగా అధిగమించాలని పంచాయతీ అధికారులను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. అధికారులతో టెలీకాన్ఫరెన్స్ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ ప్రోగ్రామ్ ద్వారా 625 గిరిజన ఆవాసాలకు మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పాటవుతుందన్నారు. రోడ్ల నిర్మాణంపై రెండు వారాలకు ఒకసారి శాఖాపరంగా సమీక్షించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పిఎం జన్‌మన్ పథకంతోపాటు ఉపాధి హామీ పథకం, ఉప ప్రణాళిక నిధులు కలిపి రూ.1,005 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. రహదారి సౌకర్యం లేని గిరిజన ఆవాసాలను సైతం అనుసంధానించేలా రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. డోలీ రహిత గిరిజన ఆవాసాలు ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. అటవీశాఖ నుంచి రావాల్సిన అనుమతులపై త్వరలోనే శాఖతో సమీక్ష నిర్వహించి ఆ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయిస్తామని తెలిపారు. కొండలపై ఉన్న ఆవాసాలను అనుసంధానిస్తూ కొత్త రోడ్లు రూపకల్పన చేసేందుకు బండరాళ్లను బద్దలు కొడుతూ ముందుకు వెళ్లేందుకు అధిక సమయం తీసుకుంటున్నట్లు పవన్‌కల్యాణ్‌కు అధికారులు వివరించారు. ప్రస్తుతం వర్షాలు పడటంతో పనుల్లో వేగం తగ్గిందని, 128 రోడ్లు రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో ఉండటంతో అటవీ అనుమతులు కోరగా, అందులో ఇప్పటి వరకు 98 రోడ్లకు వచ్చాయన్నారు. మొత్తమ్మీద 186 పనులను ఇప్పటి వరకు చేపట్టినట్లు, మరో 20 పనులు టెండర్ దశలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

జనసేన కార్యాలయంలో తెలంగాణ మంత్రులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మంగళగిరిలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పలువురు తెలంగాణ మంత్రులు జనసేన పార్టీ కార్యాలయంలో దిగారు. ఆదివారం జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలోని హెలిప్యాడ్‌లో వారు ప్రయాణించిన హెలికాప్టర్ ల్యాండ్ అయ్యింది. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తరపున శాసనమండలిలో ప్రభుత్వ విప్ పి హరిప్రసాద్ వారికి స్వాగతం పలికారు. తెలంగాణ మంత్రులకు ఈ సందర్భంగా కొండపల్లి బొమ్మలతో కూడిన జ్ఞాపికలు బహూకరించారు. హెలికాప్టర్‌లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకాటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నారు. మంత్రులకు వీడ్కోలు పలికిన వారిలో రాష్ట్ర మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, పార్టీ కార్యక్రమాల నిర్వహణ విభాగం కన్వీనరు కళ్యాణం శివ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్ ఉన్నారు.

గండ్లు పూడ్చేదెప్పుడు?



గత ఏడాది సెప్టెంబర్లో వరదలకు రాజుపాలెం వద్ద ఏలేరు కాలువకు పడిన గండి (ఫైల్)

- గతేడాది సెప్టెంబర్లో భారీ వర్షాలకు 280 చోట్ల తెగిన గట్లు
- ఏటా నష్టపోతున్న 'ఏలేరు' ఆయకట్టు రైతులు
- పట్టించుకోని సర్కారు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

గత ఏడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ఏలేరు ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారం రోజులపాటు వచ్చిన వరదలతో పంటను కోల్పోయారు. ఏలేరు కాలువకు పలుచోట్ల భారీ గండ్లు పడ్డాయి. తాత్కాలిక మరమ్మతులతో అధికారులు చేతులు దులిపేసుకున్నారు. ఫలితంగా ఏలేరు ప్రాజెక్టు నుంచి సక్రమంగా నీరు అందక అన్నదాతలకు కష్టాలు, నష్టాలు తప్పడం లేదు. కాకినాడ జిల్లాలో గోదావరి కాలువ ద్వారా సుమారు 1.20 లక్షల ఎకరాలు, ఏలేరు ద్వారా సుమారు 50 వేల ఎకరాలు, పంపా ద్వారా 7,800 ఎకరాలు, తాండవ ద్వారా పది వేల ఎకరాలు, పుష్కర కాలువ ద్వారా 5,400 ఎకరాలు, సుబ్బారెడ్డి సాగర్ ద్వారా 4,900 ఎకరాలు, బోర్లు, ట్యాంకుల ద్వారా 30 వేల ఎకరాల్లో వరి సాగుకానుందని అధికారులు అంచనా వేశారు. అయితే, ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాజెక్టుల్లోనూ పూర్తి స్థాయిలో సాగునీరు లేదు. దీంతో, ఖరీఫ్ సాగు నత్తనడకన సాగుతోంది.

విడుదల కాని నిధులు

20 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా గతేడాది సెప్టెంబర్‌లో పెద్ద ఎత్తున ఏలేరుకు వరదలు సంభవించాయి. దీంతో జగ్గంపేట, కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల్లో 280 చోట్ల ఏలేరు కాలువ వెంబడి గండ్లు పడ్డాయి. సుమారు 70 వేల ఎకరాల్లో వరి నేలమట్టమైంది. ఈ గండ్లు పూడ్చేందుకు అధికారులు రూ.25.38 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కలెక్టర్ చొరవతో 29 గండ్లను రూ.1.99 కోట్లతో తాత్కాలికంగా పూడ్చారు. రెండో దశలో రబీ సీజన్‌కు సాగునీటి కష్టాలు ఏర్పడకుండా రూ.3.50 కోట్ల అంచనాతో 38 గండ్లను పూడ్చేందుకు పనులు చేపట్టారు. మొత్తంగా రూ.5.51 కోట్లతో 67 గండ్లను తాత్కాలికంగా పూడ్చగలిగారు. అయితే, తొలి దశలో జరిగిన 29 పనుల్లో ఇంకా ఏడు పనులకు, ఆ తర్వాత నిర్వహించిన 38 పనులకు మొత్తంగా 45 పనుల చేసిన వారికి ప్రభుత్వం నేటికీ బిల్లులు విడుదల చేయలేదు. ఏలేరు ఆయకట్టు పరిధిలో ఇంకా 213 గండ్లు పూడ్చాల్సి ఉంది. వీటిలో 12 పనులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. మిగిలిన 201 పనులకు రూ.10.69 కోట్లు అవసరమవుతాయని అధికారులు ఈ ఏడాది మేలో ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నేటికీ నిధులను కేటాయించలేదు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

మిగిలిన గండ్లు పూడ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. త్వరలో నిధులు విడుదల అయ్యే అవకాశం ఉంది. నీటి నిల్వలు ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో లేనప్పటికీ రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోజుకి 1,700 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నాం. వర్షాభావ పరిస్థితుల వల్ల కొన్ని ఇబ్బందులు ఉన్నాయి.

– శేషగిరి, ఏలేరు ప్రాజెక్టు ఇరిగేషన్ డివిజన్, పెద్దాపురం

వరదల సమయంలో హడావుడి...

వరదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అనేక హామీలు ఇచ్చారు. పెద్ద ఎత్తున పడిన గండ్లు త్వరితగతిన పూడ్చి రైతులకు మేలు చేకూర్చేలా చర్యలు చేపడతామంటూ ప్రకటనలు గుప్పించారు. ఏడాదైనా నేటికీ గండ్లను పూడ్చలేదు. ఫలితంగా పంటలకు సాగునీరు సరిగా అందట్లేదు. మరోవైపు వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఏలేరు రిజర్వాయర్‌లోనూ నీటి నిల్వలు బాగా తగ్గిపోయాయి. 24.11 టిఎంసిల నీటి సామర్థ్యం ఉన్న ఏలేరు ప్రాజెక్టులో ప్రస్తుతం 10.06 టిఎంసిలు మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయి. ఏటా ఈ సమయానికి 15 నుంచి 16 టిఎంసిల నిల్వలు ఉంటున్నాయి. ప్రస్తుతం నీరు తక్కువగా ఉన్నా రోజుకు ఏలేరు నుంచి నీటిని కిందకు వదులుతున్నా శివారు భూములకు అందట్లేదు.




శవపేటికతో వక్కిలేరు వాగును దాటుతున్న దృశ్యం

అంత్యక్రియలకూ.. వాగు దాటాల్సిందే..

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ (నంద్యాల జిల్లా)

మృతదేహానికి అంత్యక్రియలు జరిపేందుకు నడము లోతు నీటిలో వెళ్తూ అవస్థలు పడిన సంఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. జి.జంబులదిన్నె గ్రామానికి చెందిన వడ్ల మీరావలి కుమారుడు షాజహాన్ (18) ప్రకాశం జిల్లా కంభం పట్టణంలోని ఓ ప్రయివేటు కళాశాలలో డిప్లమా చదువుతున్నారు. కళాశాలకు వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో శుక్రవారం గ్రామానికి వచ్చారు. శనివారం మధ్యాహ్నం తన స్నేహితుడితో కలిసి గ్రామ సమీపంలో ఉన్న వక్కిలేరు వాగులో ఈతకు వెళ్లారు. వాగులో నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో షాజహాన్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. గమనించిన స్నేహితుడు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లో ఉన్న వారు వచ్చి అతన్ని ఒడ్డుకు చేర్చారు. ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందారు. ఆదివారం ఆ యువకుడి అంత్యక్రియలు వక్కిలేరు వాగు వైపు ఉన్న శ్మశాన వాటికలో నిర్వహించారు. అయితే, అంత్యక్రియలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యువకుడి మృతదేహాన్ని శవపేటికలో పెట్టుకొని ఉధృతంగా ప్రవహిస్తున్న వక్కిలేరు వాగును దాటి అవతలకు తీసుకెళ్లాల్సి వచ్చింది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో అతి కష్టం మీద వాగు దాటి అంత్యక్రియలు నిర్వహించారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్మశాన వాటికకు వెళ్లేలా వాగుపై కల్వర్టు నిర్మిస్తే ఇబ్బందులు తొలుగుతాయని గ్రామస్తులు అంటున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

ఆర్‌టిసి ఆస్తులను కాపాడుకుందాం

- ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జిలాని బాషా

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

ప్రజా సంస్థ అయిన ఆర్‌టిసిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎపిఎస్‌ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె.జిలాని బాషా పిలుపునిచ్చారు. 'ఆర్‌టిసి ఆస్తులను కాపాడుకుందాం' అనే అంశంపై తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు మల్లికార్జున్ అధ్యక్షతన ఆదివారం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె.జిలాని బాషా, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, వి.నాగరాజు హాజరై మాట్లాడారు. ఆర్‌టిసికి చెందిన ఆస్తులను కార్పొరేట్లకు అప్పగిస్తే అది సంస్థ మూసివేతకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సంస్థను కాపాడుకునేందుకు పోరాటాలు చేయాలన్నారు. ఈ సదస్సు నుంచే పోరాట కార్యక్రమాలు ముమ్మరం చేయాలని కోరారు. విజయవాడలో గవర్నర్ పేట- 2 డిపోను లూలూ కంపెనీకి ఇవ్వడాన్ని ఈ సదస్సు వ్యతిరేకిస్తోందన్నారు. గత వారం రోజులుగా విజయవాడలో సిఐటియు, ఎఐటియుసి నాయకులు, ఆర్‌టిసి కార్మిక సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు, వ్యాపారులు ధర్నా నిర్వహిస్తున్నారని తెలిపారు. నగరం నడిబొడ్డున గల రూ.400 కోట్లు విలువైన ఆస్తిని, 500 మంది పనిచేస్తున్న వారిని తొలగించి కార్పొరేట్లకు కట్టబెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే నిరవధిక పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా జోనల్ కార్యదర్శి సి.భాస్కర్, అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఎస్.మణ్యం, శివకుమార్, సుధాకర్, పిఎం.రత్నం ఐవి.రమణ, ఆర్.కష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా కార్మికులను కాపాడండి

- విశాఖ కార్మిక జెఎసి డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

కంబోడియాలో చిక్కుకున్న ఆంధ్రా కార్మికులను కాపాడాలని, వారి విడుదలకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాల జెఎసి విజ్ఞప్తి చేసింది. కార్మికులను మోసగించిన ఏజెంట్ బొంగు మురళీ రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎసి నాయకులు, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు మాట్లాడుతూ.. శ్రీకాకుళం మండలం సంతబొమ్మాలికి చెందిన ఎజెంట్ బొంగు మురళీ రెడ్డి ఏడుగురు యువకులను మోసం చేశారన్నారు. కంబోడియాలో డేటా ప్రాసెసింగ్ జాబ్స్ ఇప్పిస్తామని చెప్పి ఒక్కొక్కరి వద్ద రూ.1.70 లక్షలు తీసుకొని, ఈ ఏడాది మార్చి నుంచి మే మధ్యకాలంలో కంబోడియా పంపించారని తెలిపారు. అక్కడ వారికి ఉద్యోగాలు ఇవ్వలేదని, స్థానిక కంబోడియా ఏజెంట్లకు అప్పజెప్పి ఒక్కొక్కరితో మరో మూడు వేల డాలర్లు కట్టించుకున్నారని తెలిపారు. అక్కడి నుండి వారిని చైనీస్ సైబర్ మోసగాళ్లకు అప్పజెప్పి వారితో చట్ట వ్యతిరేకమైన పనులు చేయించడానికి బలవంతం పెట్టారన్నారు. అందుకు వారు అంగీకరించకపోవడంతో చిత్రహింసలకు గురి చేస్తున్నారని తెలిపారు. మూడు రోజుల క్రితం వారిని విపరీతంగా కొట్టడం వల్ల ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయన్నారు. దీంతో వారు కంబోడియాలో సమరాంగ్ ఇండియన్ ఎంబసికి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయం తెలిసిన తర్వాత వారి మీద దాడులు ఇంకా పెరిగాయని, వారు చావు బతుకుల మధ్య ఉన్నారన్నారు. చిత్ర హింసలు అనుభవిస్తున్న వారిలో విశాఖకు చెందిన ఒక కార్మికుడు, శ్రీకాకుళానికి చెందిన నలుగురు, బిఆర్.అంబేద్కర్ కోనసీమకు చెందిన ఇద్దరు కార్మికులు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెఎం.కుమార్ మంగళం, పి.మణి, ఐఎఫ్‌టియు నాయకులు వై.కొండయ్య పాల్గొన్నారు

అంబుబాచి మేళా ఏ రాష్ట్రంలో జరుగుతుంది ?

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బిఒ) పరీక్షల మోడల్ పేపర్



– జి. శ్యామ్,
పోటీ పరీక్షల ప్రత్యేక నిపుణులు,
కాకినాడ,
సెల్ : 9848136254,
9848256254

1.Which of the following is not a Sexually Transmitted Disease (STD)?
(1) AIDS (2) Anthrax (3) Gonorrhea (4) Syphilis
క్రింది వానిలో Sexually Transmitted Disease (STD) **కానిది?**
(1) AIDS (2) ఆంత్రాక్స్
(3) గనేరియా (4) సిఫిలిస్

2.Which part of the human eye controls the recognition of colours?
(1) Rods (2) Cones (3) Retina (4) Iris
మానవుని కంటిలో రంగులు గుర్తించటాన్ని నియంత్రించేది ?
(1) రాడ్స్ (2) కోన్స్ (3) రెటీనా (4) ఐరిస్

3. Which hormone controls the menstrual cycle in females?
(1) Testosterone (2) HCTH
(3) Progesterone (4) Estrogen
స్త్రీలలో ఋతుచక్రంను నియంత్రించే హార్మోన్ ?
(1) టెస్టోస్టిరాన్ (2) HCTH
(3) ప్రొజెస్టిరాన్ (4) ఈస్ట్రోజన్

4. In the human body, water is the most abundant substance. What is the most abundant element?
(1) Carbon (2) Calcium (3) Oxygen (4) Iron
మానవ శరీరంలో అధికంగా ఉండే పదార్థం నీరు కాగా మూలకం ఏది ?
(1) కార్బన్ (2) కాల్షియం (3) ఆక్సిజన్ (4) ఇనుము

5. Which scientist classified organisms using the binomial nomenclature system?
(1) John Ray (2) Lamarck
(3) Linnaeus (4) Aristotle
జీవులను ద్వినామీకరణ పద్ధతిలో వర్గీకరణ చేసిన శాస్త్రవేత్త ?
(1) జాన్ రే (2) లామార్క్
(3) లిన్నేయస్ (4) అరిస్టాటిల్

6. A body is thrown vertically upwards and then falls back on the ground. Its potential energy is maximum
(1) on the ground (2) at the maximum height
(3) during the return journey (4) both on the ground and at the maximum height
ఒక వస్తువును నేరుగా పైకి విసిరిన తర్వాత అది మళ్లీ నేలపై పడుతుంది. దాని స్థితి శక్తి ఎక్కడ ఎక్కువగా ఉంటుంది?
(1) నేలపై (2) గరిష్ఠ ఎత్తులో
(3) తిరుగు ప్రయాణంలో (4) నేలపై మరియు గరిష్ఠ ఎత్తులో రెండింటిలోను

7. Along a streamline flow of fluid
(1) the velocity of all fluid particles at a given instant is constant
(2) the speed of fluid particle remains constant
(3) the velocity of all fluid particles crossing a given position is constant
(4) the velocity of a fluid particle remains constant
ద్రవం యొక్క క్రమబద్ధమైన ప్రవాహంతో పాటు
(1) ఇచ్చిన క్షణంలో అన్ని ద్రవ కణాల వేగం స్థిరంగా ఉంటుంది
(2) ద్రవ కణ వేగం స్థిరంగా ఉంటుంది
(3) ఇచ్చిన స్థానాన్ని దాటే అన్ని ద్రవ కణాల వేగం స్థిరంగా ఉంటుంది
(4) ద్రవ కణం యొక్క వేగం స్థిరంగా ఉంటుంది

8. A pressure cooker cooks food faster by
(1) increasing the boiling point of water
(2) decreasing the boiling point of water
(3) increasing the melting point of water
(4) decreasing the melting point of water
ప్రెజర్ కుక్కర్ ఆహారాన్ని వేగంగా ఉడికించడానికి కారణం ఏమిటి?
(1) నీటి మరిగే స్థానాన్ని పెంచడం ద్వారా
(2) నీటి మరిగే స్థానాన్ని తగ్గించడం ద్వారా
(3) నీటి ద్రవీభవన స్థానాన్ని పెంచడం ద్వారా
(4) నీటి ద్రవీభవన స్థానాన్ని తగ్గించడం ద్వారా

9. What is the more common name for solid carbon dioxide?
(1) Potash (2) Quick Silver
(3) Epsom (4) Dry Ice



ఘన కార్బన్ డయాక్సైడ్ యొక్క సాధారణ పేరు ఏమిటి?
(1) పొటాష్ (2) క్విక్ సిల్వర్ (3) ఎప్సమ్ (4) డ్రై ఐస్

10. Planets do not twinkle because
(1) they scatter more light (2) they scatter less light
(3) they act as extended source of light (4) they act as a point source of light
గ్రహాలు మెరవవు ఎందుకంటే ?
(1) అవి ఎక్కువ కాంతిని వెదజల్లుతాయి
(2) అవి తక్కువ కాంతిని వెదజల్లుతాయి
(3) అవి కాంతికి విస్తరించిన మూలంగా పనిచేస్తాయి
(4) అవి కాంతికి బిందు మూలంగా పనిచేస్తాయి

11. The hypo solution used in photography is the aqueous solution of ?
(1) sodium thiosulphate (2) sodium tetrathionate
(3) sodium sulphate (4) ammonium per sulphate
ఫోటోగ్రఫీలో ఉపయోగించే హైపో ద్రావణం దేని యొక్క నీటి ద్రావణం ?
(1) సోడియం థయోసల్ఫేట్ (2) సోడియం టెట్రాథయోనేట్
(3) సోడియం సల్ఫేట్ (4) అమ్మోనియం పెర్ సల్ఫేట్

12. On which date did the Andhra Pradesh government conduct Gram Sabhas in 13,326 Gram Panchayats to develop the Panchayati Raj system?
(1) August 23, 2024 (2) October 22, 2024
(3) August 23, 2025 (4) January 5, 2025
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను అభివృద్ధి చెయ్యడానికి 13,326 గ్రామ పంచాయతీలలో గ్రామసభలను ఏ రోజున నిర్వహించింది ?
(1) ఆగష్టు 23, 2024 (2) అక్టోబర్ 22, 2024
(3) ఆగష్టు 23, 2025 (4) Èqe] 5, 2025

13. Who is currently serving as the Finance Minister of Andhra Pradesh?
(1) Sandhya Rani (2) Payyavula Keshav
(3) Nadendla Manohar (4) Atchannaidu
ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ మంత్రిగా విధులను నిర్వర్తిస్తుంది ఎవరు ?
(1) సంధ్యారాణి (2) పయ్యావుల కేశవ్
(3) నాదెండ్ల మనోహర్ (4) అచ్చెంనాయుడు

14. In 2025, five persons from Andhra Pradesh received the Padma Shri award. Identify the person who is not among them from the following.
(1) Miriyala Apparao (2) Nagaphanisharma
(3) K.L. Krishna (4) Prakash Chandrasood
2025 సంవత్సరమునకు ఆంధ్రప్రదేశ్ నుండి పద్మశ్రీ అవార్డును 5గురు పొందగా క్రింది వారిలో లేని వ్యక్తిని గుర్తించండి?
(1) మిరియాల అప్పారావు (2) నాగఫణిశర్మ
(3) కె.ఎల్.కృష్ణ (4) ప్రకాశ్ చంద్రసుద్

15. Identify the correct statements from the following:
(a) Recently, Dr. B.R. Ambedkar Bird Sanctuary was inaugurated in Madhya Pradesh.
(b) Currently, there are 58 tiger reserves in the country.
(c) Simlipal was recognized as the 107th national park. **క్రింది వానిలో సరైన వాక్యాలను గుర్తించండి.**
(a) ఇటీవల డా॥ బి.ఆర్. అంబేద్కర్ బర్డ్ శాంక్చుయరీను మధ్యప్రదేశ్‌లో ప్రారంభించారు.
(b) ప్రస్తుతం దేశంలో 58 టైగర్ రిజర్వ్‌లు కలవు.
(c) 107వ జాతీయ పార్కుగా సిమ్లిపాల్‌ను గుర్తించారు.
(1) (a), (c)(2) (b), (c)(3) (a), (b), (c) (4) (a), (b)

16. What is India's rank in the Gender Equality Index 2025 with a score of 64.1%?
లింగ సమానత్వ సూచీ-2025లో భారత్ 64.1% స్కోర్‌తో ఎన్నవ స్థానంలో నిలిచింది ?
(1) 129 (2) 118 (3) 115 (4) 131

17. Who was appointed as the brand ambassador for the World Para Athletics Championship?
(1) Kangana Ranaut (2) Kareena Kapoor
(3) Priyanka Chopra (4) Gauri Khan
ప్రపంచ పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎవరు నియమితులయ్యారు ?
(1) కంగనా రనౌత్ (2) కరీనా కపూర్
(3) ప్రియాంక చోప్రా (4) గౌరీఖాన్

18. Where was the first Artificial Intelligence (AI) University established in India?
(1) Kerala (2) Uttar Pradesh
(3) Maharashtra (4) Odisha
భారతదేశంలో తొలి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) యూనివర్సిటీ ఎక్కడ ఏర్పాటు చేశారు ?
(1) కేరళ (2) ఉత్తరప్రదేశ్ (3) మహారాష్ట్ర (4) ఒడిశా

19. Identify the correct statements from the following:
(a) For the first time in India, a women's bus depot was established in New Delhi.
(b) Indian Railways introduced ATM services for the first time in Panchavati Express.
(c) Current Railway Board Chairman – Ashwini Kumar Vaishnaw **క్రింది వానిలో సరైన వాక్యాలను గుర్తించండి.**
(a) భారతదేశంలో తొలిసారిగా మహిళా బస్సు డిపోను న్యూఢిల్లీలో ఏర్పాటు చేశారు.
(b) భారతీయ రైల్వే తొలిసారిగా పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ATM సేవలను ప్రారంభించింది.
(c) ప్రస్తుతం రైల్వే బోర్డు ఛైర్మన్ – అశ్విని కుమార్ వైష్ణవ్
(1) (a), (c)(2) (a), (b) (3) (a), (b), (c) (4) (b), (c)

20. Theme of the 18th Pravasi Bharatiya Divas–2025?
18వ ప్రవాసీ భారతీయ దివస్–2025 ఇతివృత్తం ?
(1) Diasporas Contribution to a Viksit Bharat
(2) United by Unique
(3) Diasporas Contribution to Viksit India
(4) Swarnim Bharat : Virasat aur Vikas

21. Match the following:
List-I List-II
(a) UPSC Chairman (i) Gyanendra Pratap Singh
(b) CRPF Director General (ii) Ajay Kumar
(c) CAG (iii) Kondru Sanjay Murthy
(d) RBI Governor (iv) Sanjay Malhotra
ఈ క్రింది వాటిని జతపరచండి.
జాబితా-I జాబితా-II
(a) UPSC ఛైర్మన్ (i) జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్
(b) CRPF డైరెక్టర్ జనరల్ (ii) అజయ్ కుమార్
(c) CAG (iii) కొండ్రు సంజయ్ మూర్తి
(d) RBI గవర్నర్ (iv) సంజయ్ మల్హోత్రా
(1) (a)-(i), (b)-(ii), (c)-(iii), (d)-(iv) (2) (a)-(i), (b)-(iii), (c)-(ii), (d)-(iv)
(3) (a)-(ii), (b)-(i), (c)-(iii), (d)-(iv) (4) (a)-(iv), (b)-(i), (c)-(iii), (d)-(ii)

22. The Tiger Triumph joint naval exercise 2025 was held between which two countries?
(1) India and USA (2) India and Russia
(3) India and Japan (4) India and China
టైగర్ ట్రయాంఫ్ సంయుక్త సముద్ర విన్యాసం 2025 ఏ రెండు దేశాల మధ్య జరిగింది ?
(1) భారత్ & అమెరికా (2) భారత్ & రష్యా
(3) భారత్ & జపాన్ (4) భారత్ & చైన□

23. Where was India's first electric tractor launched?
(1) Maharashtra (Pune) (2) Maharashtra (Thane)
(3) Madhya Pradesh (Indore) (4) Bhubaneswar (Odisha)
భారతదేశంలో తొలి విద్యుత్ ట్రాక్టర్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు ?
(1) మహారాష్ట్ర (పూణె) (2) మహారాష్ట్ర (థాణె)
(3) మధ్యప్రదేశ్ (ఇండోర్) (4) భువనేశ్వర్ (ఒడిశా)

24. Which state recently launched Navodaya 2.0 to curb illicit liquor?
(1) Telangana (2) Odisha
(3) Kerala (4) Andhra Pradesh
అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు నవోదయ 2.0ను ఇటీవల ఏ రాష్ట్రం ప్రారంభించింది ?
(1) తెలంగాణ (2) ఒడిశా (3) కేరళ (4) ఆంధ్రప్రదేశ్

25. Identify the correct statements from the following:
(a) The 38th National Games were held in Uttarakhand from January 28 to February 14, 2025.
(b) Vaibhav Suryavanshi is the first Indian cricketer to score the most runs in T-20.
(1) (a), (b) (2) (a) only (3) (b) only (4) None
క్రింది వానిలో సరైన వాక్యాలను గుర్తించండి.
(a) 38వ జాతీయ క్రీడలు జనవరి 28-ఫిబ్రవరి 14, 2025 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగాయి.
(b) T-20లో అత్యధిక పరుగులు చేసిన తొలి భారతీయ క్రికెటర్-వైభవ్ సూర్యవంశీ
(1) (a), (b) (2) (a) మాత్రమే (3) (b) మాత్రమే (4) ఏదీకాదు

26. In which state is the Ambubachi Mela held every year in the month of June?
(1) Tripura (2) Nagaland (3) Manipur (4) Assam
అంబుబాచి మేళా ప్రతీ సంవత్సరం జూన్ నెలలో ఏ రాష్ట్రంలో జరుగుతుంది ?
(1) త్రిపుర (2) నాగాలాండ్ (3) మణిపూర్ (4) అస్సాం

27. In which year was the Sports Authority of India (SAI) established
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI) ఏ సంవత్సరంలో స్థాపించబడింది?
(1) 1975 (2) 1980 (3) 1984 (4) 1988

28. Tianwen-2 Mission, recently in news, is related to:
(1) Solar flare observations
(2) Sampling a quasi-satellite asteroid
(3) Manned mission to the Moon
(4) Deployment of a space telescope
ఇటీవల వార్తల్లో నిలిచిన టియాన్‌వెన్-2 మిషన్ దేనికి సంబంధించింది:
(1) సౌర మంటల పరిశీలనలు
(2) క్వాసి-శాటిలైట్ గ్రహశకలం నమూనా సేకరణ
(3) చంద్రుడికి మానవ సహిత మిషన్
(4) అంతరిక్ష టెలిస్కోప్ మోహరింపు

జవాబులు : (1) 2 (2) 2 (3) 3 (4) 3 (5) 3 (6) 2 (7) 3 (8) 1 (9) 4 (10) 3 (11) 1 (12) 1 (13) 2 (14) 4 (15) 3 (16) 4 (17) 1 (18) 3 (19) 2 (20) 1 (21) 3 (22) 1 (23) 2 (24) 4 (25) 1 (26) 4 (27) 3 (28) 2



"సమాజంలో అసహాయులుగా ఉన్న వారిలో చైతన్యమూ, బెదిరి ఉన్నవాళ్లకు ధైర్యమూ, వ్యక్తిత్వం కోల్పోయినవారికి వ్యక్తిత్వమూ ఇవ్వడం కన్నా రచయితకు తన రచనల ద్వారా చేయగల ఉత్తమమైన పని ఇంకేమైనా ఉందా?"

– కొడవటిగంటి కుటుంబరావు



అన్నం గిన్నెను తన్నేసి..

పల్లవి : చూడూ కూటమి సర్కారూ! ఘోరం
దాని పనితీరూ!
పప్పూ బెల్లాల లాగా
భూములు ఇస్తోంది! "చూడూ"

1

చరణం :
సూటు బూటు కార్పొరేటుని
సూడగానే నవ్వింది
మా ఇంటికి తలుపులు లేవూ
రా రా అని పిలిచింది.. "హోయ్"
కరచాలనమే చేసింది
కౌగిలిలోన కరిగింది
కారు చౌకగా భూములు
కేటాయిస్తోంది "చూడూ"

2

లూలోడో గాలోడో
పెద్ద మాలు కడతానంటే
ఏ ఇండో సోలోడో
కంపెనీ పెడతానంటే .. "హోయ్"
పంటల, తోటల భూముల్నీ
చేపలు పెంచే చెరువుల్నీ
పార్కూ, బస్టాండ్ కూడా
పంచేస్తున్నాది! "చూడూ"

3.

హిందూపురమూ దగ్గర
కందసార అన్నారూ
జిందాలు కంపెనీకి
ఎస్కోటలో ఇచ్చారు ..
ముదిగొండను గుదిబండగా మార్చేశారూ.. "హోయ్"
ఏళ్లు గడచిపోతున్నా
ఫ్యాక్టరీలు ఏవన్నా?
తిరిగి రైతుకివ్వాలంటే
తల తిప్పేస్తుంది "చూడూ"

4.

కన్న ఊరు ఖాళీ జేసి
కాలనీలు కడతారంట!
ఉన్న భూమి లాగేసి
ఉద్యోగాలిస్తారంట! "హోయ్"
అన్నం గిన్నెను తన్నేసి
ఆకలి తీరుస్తారంట!
ఉద్దానం, కరేడు రైతులు
నిలదీస్తున్నారూ "చూడూ"

5

కాల్దారి, కాకరపల్లి,
సోంపేట రైతులను
కాల్చీ చంపించిన వాళ్లు
కాల గతిలో ఏమయ్యారు? "హోయ్"
రైతుల రక్తం, కన్నీరు
ఉద్యమ కెరటంగా మారూ!
వీరు కూడా ఆ హోరులో
కొట్టుకుపోతారూ..

ముగింపు పల్లవి :
నాగలి పట్టిన చేతులు రా!
ప్రారంభిస్తే ఆగవురా!
సాలూ సాలూ పోసి
ముందుకు సాగేరా! "నాగలి"

– నల్లి ధర్మారావు, 76609 67313

నా కలం జ్వలిస్తూనే ఉంది!

నా కలం సాగిపోతుంది
దెబ్బమీద దెబ్బ తగులుతూనే ఉన్నాయి
అయినా కలం ఆగిపోలేదు
కళానికి నికి గాయాలు కొత్త కాదు

రక్తమోడుతూనే ఆలాపన సాగిపోతున్నట్టు
రాలిపోతున్న సిరా చుక్కలు మధ్య నుంచి
కలం జ్వలిస్తూ నే ఉంది.
ఆగిపోడానికి అది యంత్రం కాదు, మంత్రం కాదు
చైతన్యపు జ్వాల రగిలించే ఆయుధం
నిప్పుల గుండం మీద ఎగిసిపడే అగ్ని తుపాను...

మణిపూరు మారణ హోమం
కాశ్మీర్ లో పెహల్గాం రక్త సిందూరం
హనుమంతుని తోకలా పెరుగుతున్న నిరుద్యోగం
ఢిల్లీ నుంచి గల్లీ దాకా
మూఢ విశ్వాసాలే శ్వాసగా సాగుతున్న పాలనపై
నా కలం వసంత మేఘ గర్జనై మెరుస్తుంది!

విద్యార్థులు మెదళ్ళలో
విశగుళికలు ఎక్కించే కుట్ర
పాఠాల సిగలో కెక్కిన మతం జాతకాల జాడ్యం పైన
నిత్యం స్పందిస్తూనే ఉంది

స్వేచ్ఛకి ప్రాణం పోసిన రాజ్యాంగం ఊపిరిని తీస్తున్న
రాక్షస క్రీడలో అందరూ నిర్దోషులే..
ప్రశ్నించే వాడే దోషి!

ఇప్పుడు శోధించాల్సింది
నిగుడ రహస్యాలు కాదు
రాజ్యాంగ రథంపై సాగే
ప్రజాస్వామ్య స్వేచ్ఛా విహంగాలు కావాలి

నువ్వు నిషేధించేది నా కలాన్ని
ఓ రాజ్యమా..
నేను నక్కల అరుపుని నమ్మను
చుక్కలు పొద్దయి పొడుస్తాను
నువ్వు నా ప్రాణం తీయొచ్చు...
నా ఆశయం విశ్వమంతా ఆవహించే
నిరసన జ్వాలై నిన్నదిస్తున్నది
అది మంచై రాలుతుంది వర్షమై కురుస్తుంది.
నీటి తుపానై సునామీలా
ఎడారి సుడి గుండాలై నిన్ను ముంచెత్తక తప్పదు!

– రెడ్డి శంకర రావు, 94943 33511

అమెరికా గద్దెపై అతి తెలివి పెద్దన్న

గద్దింపులే తన దౌత్య సిద్ధాంతమంటాడు
నియమాలు, మన్ననలు రద్దు చేస్తుంటాడు
తంపులు, తగవులకు సిద్ధమైపోతాడు
రష్యాతో దూరం ఆవశ్యమంటాడు
చెలిమి చేయుట నైచ్యమంటాడు
రహస్యంగా తానే చేయి కలిపేస్తాడు
తాను చేస్తే బేరాలు, సారాలు
ఇతరులైతే కారాలు, మిరియాలు
దండింపదగ్గ నేరాలు, ఘోరాలు


అమెరికా పెద్దన్న ... అతి తెలివి పెద్దన్న
సుంకాల కింకరుడై హుంకరిస్తుంటాడు
రంకెలేస్తుంటాడు
వాడి సరకులు తెచ్చి గుమ్మరిస్తుంటాడు
మన తలుపులు తెరిచి గమ్మునుండాలి
నిండా ముంచినా వాడినే నమ్ముతూ ఉండాలి
మన వస్తుసేవలపై విషము చిమ్ముతూ ఉంటాడు
పన్ను గాట్లతో సొమ్ము పీల్చేస్తు ఉంటాడు
వాడు చేస్తే వ్యాపారం.. మనదేమో అపచారం
అమెరికా పెద్దన్నది, అహంకారపు బుద్ధి
బహుళ ధ్రువ ప్రపంచాన భస్మాసుర హస్తమది!

– డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ.
94408 36931

వివక్షను ఎండగట్టిన తొలి తరం కవి చోడగిరి చంద్రరావు

పరిశోధన

తెలుగులో దళిత సాహిత్యం ప్రధానంగా రెండు దశల్లో కొనసాగుతోంది. తొలి దశలో సంస్కరణోద్యమంలో భాగంగా వచ్చింది. దీనిలో అస్పృశ్యత వల్ల ఎదుర్కొనే సమస్యల చిత్రణ, దళితులు అభ్యున్నతి కోసం విజ్ఞాపన చేయడం, తమ దళిత నాయకుల స్మరణ, సంప్రదాయ కవులతో పోటీపడి పద్య కవిత్వాన్ని కూడా రాయడం, సంప్రదాయ సాహితీవేత్తల మన్ననల కోసం ఎదురుచూడ్డం, దళితేతరులు కూడా దళితుల పట్ల సానుభూతితో రచనలు చేయడం మొదలైన ధోరణిలో కనిపిస్తుంది. రెండవ దశలో ఆత్మగౌరవ ప్రకటన, ప్రధాన జీవన స్రవంతి కోసం ప్రయత్నం, రాజ్యాధికారానికి సాహిత్యం కూడా ఒక సాధనమని నమ్మడం, సాహిత్యాన్ని ప్రయోజన సాధనంగా భావించడం, ఒక ధిక్కార స్వరాన్ని వినిపించడం, ప్రత్యామ్నాయ సాహిత్యాభిలాష, సంస్క ృతి నిర్మాణం మొదలైనవి ప్రధానంగా కనిపిస్తాయి. తొలి తరం దళిత సాహితీవేత్తల్లో గుర్రం జాషువా, బోయి భీమన్న, ఎస్.టి.జ్ఞానానందకవి మరికొంతమంది తెలిసినంతగా మిగతా కవులు, రచయితలు ఈనాటి యువకవులు, సాహితీవేత్తలకు పెద్దగా తెలియదని చెప్పొచ్చు. దళిత సాహిత్య సౌందర్యంపై డాక్టరేట్ చేసిన పరిశోధకుడు, కవి, మంచి వక్త డా.కోయి కోటేశ్వరరావు తొలి, మలి తరాలను చక్కగా సమన్వయిస్తూ దళిత సాహిత్యాన్ని ప్రధాన జీవన స్రవంతిలోని పత్రికల ద్వారా సమాజానికి తెలియజేస్తున్నారు. కొంతమంది పేర్లు విన్నవారికి, వారి గురించి లోతుగా వ్యాసం రూపంలో చదివినప్పుడు, ఇంత గొప్ప కవి తెలుగులో ఉన్నారా?' అనిపించేటంతటి ఆశ్చర్యానికి లోనయ్యే అంశాలను తన పరిశోధన ద్వారా డా.కోయి కోటేశ్వరరావు వెలికితీస్తున్నారు. ఇప్పుడు ఆయన సంపాదకత్వంలో 'మధురకవి' చోడగిరి చంద్రరావు గారి సాహిత్యం వెలువడ్డం తెలుగు సాహిత్యానికి గొప్ప చేర్పు. ఒకప్పుడు ప్రాచీన సాహిత్యానికి వేటూరి ప్రభాకరశాస్త్రి, అన్నమయ్య సాహిత్యానికి రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, వేమనకు ఎన్.గోపి మొదలైనవారు ఎలాగో, ఇప్పుడు తెలుగు దళిత సాహిత్యానికి డా. కోయి కోటేశ్వరరావు అటువంటి పాత్రను నిర్వహిస్తున్నారు. సంప్రదాయ సాహిత్యంతో పాటు, ఆధునిక సాహిత్య తత్వాన్ని అవగాహన చేసుకున్న సహృదయ కవి, పండితుడు, విమర్శకుడు డా. కోయి కోటేశ్వరరావు. ఈ దిశగా జరుగుతున్న కృషిలో ఈ పుస్తకం తొలి అడుగు కావచ్చు.



తొలి తరానికి చెందిన దళిత కవి చోడగిరి చంద్రరావు తూర్పు గోదావరి జిల్లా కోనసీమ ప్రాంతానికి చెందిన కవి. 1932 జులై 15న కోరుమిల్లి గ్రామంలో జన్మించాడు. తల్లితండ్రులు బుల్లెమాంబ, వెంకటస్వామి. చంద్రరావు కొంతకాలం పాటు రక్షణ శాఖలో సైనికుడిగా పనిచేశాడు. ఆ తరువాత భారతీయ రైల్వే శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించాడు. పద్యకవిత్వాన్ని ఎంతో రసభరితంగా రచించారు. గేయ కవిత్వాన్ని కూడా సరళ సుందరంగా, మాధుర్యంతో అందించారు. ఈయన తన తొలి రచన శతకంతో ప్రారంభమయ్యింది. ఆయన 'భీమశతకము' పేరుతో 144 పద్యాలను రచించారు. సాహిత్యంలో కులం వల్ల జరుగుతున్న కష్ట నష్టాలను కూడా దీనిలో ప్రస్తావించారు. ఈ శతకం మరో ప్రత్యేకత ఏమిటంటే, ముందుగా డా.బి.ఆర్. అంబేద్కర్ జీవితాన్ని, ఆయన దళితులకు చేసిన అపూర్వమైన కృషిని చక్కని వచనంలో వివరించడం. ఆ తర్వాత 'భీమశతకము'ను వర్ణిస్తూ, దళితుల జీవన స్థితిగతులు ఎలా ఉన్నాయో సరళ సుందరమైన పద్యాల్లో వర్ణించారు. భీమ శతకము రెండవ భాగాన్ని డా.బి.ఆర్. అంబేద్కర్‌కి అంకితమిస్తూ... "కవిత నీవు నాకు, కావ్యవస్తువు నీవు/ కంఠమందు నీవు కనుల నీవు/ నీవు లేని నేను నిర్జీవ ప్రతిమనే/ ఏమి చెప్పనయ్య భీమరాయ" అని తన ఆయన పట్ల తనకున్న అభిమానాన్ని వర్ణించారు. ఈ రెండవ భాగంలో 108 పద్యాలు ఉన్నాయి. ఇవన్నీ దళితుల వేదనను వర్ణించేవి. ఆ సమస్యలను పరిష్కరించడంలో డా.బి.ఆర్. అంబేద్కర్ అందించిన మార్గాల్ని సందర్భానుసారంగా ప్రస్తావిస్తాడు కవి.

చంద్రరావు గీతాలు (1974)లో ఉగాదిని తనదైన పద్ధతిలో ప్రేమను కురిపించే ఉగాదిగా రావాలని ఆహ్వానిస్తాడు. 'దివ్యసంస్క ృతి' పేరుతో డా.బి.ఆర్. అంబేద్కర్‌పై చక్కని గీతాన్ని రాశారు. దీనిలో ఉన్న 12 గీతాలు పాడుకోవడానికి, కొన్ని పాఠశాల స్థాయిలో పాఠ్యాంశాలుగా పెట్టడానికి అనుకూలమైనవి. సంప్రదాయ సాహిత్య సాన్నిహిత్యంతో ఈ గీతాలు కొనసాగాయి. 'చంద్రరావు కవిత' (1977) ఛందోబద్ధ పద్యాలతో పాటు, మాత్రా ఛందస్సుతో కూడిన కవిత్వం. దీనికి ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి పీఠిక రాశారు. భారతదేశంలో ఏర్పడిన అత్యవసర పరిస్థితి, దాని తర్వాత వచ్చిన సామాజిక స్థితిగతులను కూడా ఈ పుస్తకంలో చంద్రరావు వివరించారు. తన ఊరు గురించి వర్ణిస్తూ చెప్పిన కవిత కోనసీమ అందాలను కనువిందు చేస్తూ శాశ్వతమైన ఒక చిత్రంలా మనసులో ముద్రితమయ్యేటట్లుగా వర్ణించాడు కవి. "పచ్చని పూలు విచ్చి నవ్వెను/ పచ్చనీ చేలన్నీ నవ్వెను/ అచ్చ తెలుగున పాటలను విని/ అందమే నవ్వెన్" అని వర్ణించిన తీరు ఎంతో భావుకతతో కూడింది. అక్కడ ఉండే లతలు గురించి వర్ణిస్తూ "ఏటి మీదకు వంగి చెవిలో, మాటయేదో మరువవద్దని మాటి మాటికి తలల నూచెడి మాలతీ లతలు" తమ ఊరిలో ప్రవహిస్తున్న గౌతమీ గోదావరి నీటి మీద గాలికి వ్రాలే లతలకు సజీవత్వాన్నిచ్చి, ఒక రహస్యమేదో చెవిలో చెప్పున్నట్లు ఉత్ప్రేక్షించిన భావుకత కవి ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తుంది.

అప్పటికే ఈ కవి ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో అనేక కవితలను చదివి వినిపించేవారు. 'ఏకలవ్యుడు' పేరుతో రాసిన రెండు పద్యాలు కవి సంప్రదాయ సాహిత్య దృక్పథాన్ని తెలియజేస్తున్నాయి. ఏకలవ్యుడు బొటనవ్రేలు కోల్పోవడం, కర్ణుడు కుంతీ కుమారుడే అయినా అతడిని అస్త్రవిద్యా ప్రదర్శన సమయంలో చేసిన అవమానం వంటివన్నింటినీ అన్యాయంగా భావిస్తాడు కవి. 'హృదయ వీణ' (1968) రచనకు గుర్రం జాషువా, వేదుల సత్యనారాయణ శాస్త్రి, తోకల భాస్కరరావు (స్ఫూర్తిశ్రీ), దివాకర్ల వేంకటావధాని, బోయి భీమన్న, గున్నేపల్లి అక్షయలింగ కవి, సి.నారాయణరెడ్డి, ఎస్.టి.జ్ఞానానందకవి వంటి వాళ్ళెంతోమంది తమ ముందుమాటల్ని అందిస్తూ ప్రశంసించారు. 'అన్వేషణ' (1981) ఖండకావ్య సంపుటిలో 'వాల్మీకి' గురించి వర్ణిస్తూ ఆయన జీవితాన్ని పరిచయం చేస్తారు. 'అంటరానితనము' పేరుతో రాసిన ఖండికలో కులం వల్ల కలిగే నష్టాలను వర్ణిస్తూ... 'దేశప్రగతి సర్వనాశనమ్ము జేసిన/ కులవ్యవస్థ గూర్చి కమిలి యేడ్తు/ హార్టెటాకు, టీబి అబ్బ! క్యాన్సరు కన్న/ అంటరానితనము హానికరము' అంటాడు కవి. దీనిలో కులం వల్ల సమాజంలో వచ్చే కష్టనష్టాలను గుండెపోటు, క్షయ, క్యాన్సరు కంటే భయంకరమైనడం అనుభవపూర్వకంగా చెప్పిన మాటలు. చోడగిరి చంద్రరావు అంబేద్కర్ తత్త్వాన్ని ప్రచారం చేసి అంబేద్కర్ కవిగా పేరొందినా, వాల్మీకి, వ్యాసుడు, బోయి భీమన్న తదితర దళిత కవులను ప్రశంసించినా, ప్రతి ఒక్కరినీ స్పందింపజేసే కవిత్వాన్ని ఎంతో రచించారు. అంబేద్కర్ భావాల్ని సాహిత్యంలో అందించే ఈ కవిని 'భీమ్ కవి' అని ప్రసిద్ధి పొందారు. ఈయన శైలి మృదుమధురమైంది. కోనసీమలో పువ్వుల పరిమళాలను నింపుకొని ప్రవహించే గౌతమీనది ప్రవాహంలానే ఆయన కవిత్వం కూడా మనసులను పరిమళింపజేస్తుంది. తెలుగు సాహిత్యంలో ఒక ఉత్తమ కవిని మరలా ఇలా ఆయన రచనలన్నింటినీ తీసుకొస్తూ ఈ తరానికి కూడా పునః పరిచయం చేయడం ఎంతో గొప్ప పని. ఈయన రచనలను భీమ్ సాహితీ స్రవంతి పక్షాన ఇలా తీసుకొన్న ప్రచురణ కర్త, చంద్రరావు గారి అల్లుడు, ప్రముఖ అంబేద్కరిస్ట్ నేలపూడి బాలరాజు గారిని, దీన్ని సేకరించి ఇలా అన్ని రచనలు ఒక పుస్తకంగా వెలువడ్డానికి కారణమైన డా.కోయి కోటేశ్వరరావు గారిని ప్రతి ఒక్కరూ అభినందించాలి.


– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
99896 28049

అమూల్య గ్రంథాల పరామర్శ

పుస్తకం

ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ విమర్శకులు, నిరంతర అధ్యయనశీలి. వందలాది సమీక్షలు, విమర్శనాత్మక వ్యాసాలు రాశారు. 'మూసి' పత్రికలో రాసిన పరిశోధనాత్మక వ్యాసాలతో 'గ్రంథాంతరంగం' పేరుతో ఒక పుస్తకాన్ని వెలువరించారు. ఇందులో తెలుగు సాహిత్యానికి సంబంధించిన 30 పుస్తకాల పరిచయాత్మక, విశ్లేషణాత్మక వ్యాసాలు ఉన్నాయి. కనుమరుగైపోయిన ఈ అమూల్య గ్రంథాలన్నింటిని వెతికి, వాటిని లోతుగా పరిశీలించి అందులోని కొత్తదనాన్ని, గొప్పదనాన్ని ఈనాటి పాఠకులకు తెలియజేయడం కోసమే ఈ వ్యాసాలను రాశారు.

వంగూరి సుబ్బారావు పంతులు గారు తన 32వ ఏట 'ఆంధ్రవాఙ్మయ చరిత్రము'ను 1920లో రచించి చరిత్ర కెక్కారు. బౌద్ధ జైన బ్రాహ్మణ మతాల స్థితిగతుల నేపథ్యాన్ని, తెలుగు కావ్య రచనపై వాటి ప్రభావాన్ని చర్చించడం ఈ ఆంధ్ర వాఙ్మయ చరిత్రలోని ప్రత్యేకత. తిక్కన భారత భాగము తెలుగు తేనెలో నూరవేసి సంస్క ృత భారతమును తెలుగు భారతముగా చేసివేసినాడు అంటూనే శ్రీనాథుని కావ్యాల్ని ఇలా అంచనా వేశారు. 'ఇతడు స్వతంత్ర కావ్యములు వ్రాయగల బుద్ధి సూక్ష్మత కలవాడయ్యు, పండితుడై నూతన సృష్టి నొనర్పలేకపోయెను. ప్రబంధ సృష్టికి బీజములు మాత్రం నాటగలిగెను.' అంటారు. గ్రంథకర్త 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర'లో కేవలం 9 పేజీలే కేటాయించినా 1920 నాటికి 500కు పైగా శతకాలు ఉన్నాయని గుర్తించగలిగారు. వీరి భావజాలం, అభిప్రాయ ప్రకటనలపై కట్టమంచి రామలింగారెడ్డి గారి 'కవిత్వ తత్వ విచారం' ప్రభావం కొట్టవచ్చినట్లు కనబడుతుంది. బసవరాజు అప్పారావు గారి 'ఆంధ్ర కవిత్వ చరిత్రము' 1921 తెలుగు కవిత్వతత్వాన్ని పరిశీలించిన లాక్షణిక గ్రంథం. భావకవిగా పేరొందిన బసవరాజు కవిత్వతత్వ విచారాన్ని ఇంత లోతుగా చేయడం, అందులోనూ గ్రాంథిక భాషలో ఈ గ్రంథాన్ని వెలువరించడం ఆశ్చర్యకరమే. అక్కిరాజు ఉమాకాంతం గారు తన 'నేటి కాలపు కవిత్వం'లో భావ కవిత్వంపై విరుచుకుపడ్డారు. అయోమయత్వాధికరణం, పులుముడు, ఘటనాధికరణం, శబ్ద వాచ్యతాధికరణం అన్న చోట్ల భావ కవిత్వ దోషాల్ని చించి చెండాడారు. ఉమాకాంతం గారు భావ కవిత్వంలోనూ, ఎంకిపాటల్లోనూ, నారాయణమ్మ–నాయుడు బావ పాటల్లోనూ, ఇతరత్రా వ్యక్తమైన శృంగారాన్ని మెచ్చుకోకపోగా నిరసించారు కూడా. 1924లో ప్రచురితమైన భోగరాజు నారాయణమూర్తి గారి 'ఆంధ్ర కవిత్వ చరిత్రము'లో ఆంగ్ల సాహిత్య అధ్యయన ప్రభావం వల్ల కవిత్వ నిర్వచన, లక్షణ ప్రయోజనాల్ని సంస్క ృతాంధ్ర లాక్షణికుల అభిప్రాయాలతో మేళవించి తన అభిమతాన్ని వ్యక్తం చేశారు. తెలుగు కవిత్వ రచన యుగధర్మాన్ని ప్రతిబింబించిందనీ, కాలపరివర్తనంతో పాటు తన స్వరూప స్వభావాన్ని కూడా మార్పు చేసుకుంటూ నడిచిందని ఆయన నూరేళ్ళ కిందటనే గుర్తించడం విశేషం. కల్లూరు వెంకట నారాయణరావు గారు తమ 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము'ను 5 ఖండాలుగా విభజించి, ఒక్కో ఖండాన్ని కొన్ని యుగాలుగా భావించి, ఆ యుగ కాలావధిని పేర్కొని సంఘ చరిత్ర, వాఙ్మయ చరిత్ర, కావ్య విమర్శ, యుగలక్షణ సమన్వయము అనే అంశాల వారీగా పరిశీలించారు. మునుపటి, తర్వాతి తెలుగు సాహిత్య చరిత్రకారులు ఎవరూ ఈ దృష్టితో తెలుగు సాహిత్య చరిత్రను పరామర్శించిన వైఖరి లేదు. కల్లూరు వారు ఒక్కో యుగం కాల పరిమితిలోని దేశ సాంఘిక, రాజకీయ, మత పరిస్థితుల్ని సమీక్షించి – ఆ కాలంలో వెలువడ్డ కవిత్వానికి ప్రేరకమైన స్థితిగతుల్ని నిరూపించారు.



"ఆంధ్ర గద్య వాఙ్మయ చరిత్ర" కర్త గొబ్బూరు వెంకటానంద రాఘవరావు – నన్నయ భారతంలోని గద్యాన్ని లక్ష్యంగా స్వీకరించి సంస్క ృతం, ఆంగ్ల సాహిత్య లక్షణ పుస్తకాల ఆధారంగా తమ విమర్శన ప్రారంభించారు. నన్నయ్య వచన రచనా వైశిష్ట్యంతో పాటు నన్నెచోడుడు, తిక్కన, ఎర్రన, శ్రీనాథుడు, పోతన మొదలైన పద్య కవుల గద్యాన్ని, దక్షిణాంధ్ర యుగ కవుల వచన రచనలను, చిన్నయ సూరి, వీరేశలింగం పంతులు గార్ల గద్యరచనలు, దేశ చరిత్రలు, స్వీయ చరిత్రలు, నవలలు, శాస్త్ర గ్రంథాల్లోని గద్యరీతుల్ని విమర్శనాత్మకంగా పరిశీలించారు. 'ప్రాకత గ్రంథకర్తలు– ప్రజా సేవానూ' అనే గ్రంథం రాసిన పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి దీని ద్వారా తెలుగు వాళ్లకు పరిచయం లేని ప్రాకృత కావ్యాల విశేషాలను తెలియజేయడం మొదటి కారణం కాగా, ఆ కావ్యాల విశిష్టతను వ్యావహారిక భాషలో తేటతెల్లం చేసి, వాడుక భాష శక్తి సామర్థ్యాన్ని ప్రదర్శించడం రెండవ కారణం. ఈ రచన జరిగిన కాలానికి అంటే 1933 నాటికి ఇంత ఘనమైన విషయాన్ని ఇంత తేట తెలుగులో వెల్లడించడం అద్భుతం. కురుగంటి సీతారామయ్య విద్యార్థి దశలోనే 'అలంకార తత్వ విచారము' అన్న 97 పేజీల విమర్శనా కృతిని వెలయించడం ఆశ్చర్యం. ఆయన సందర్భానుసారంగా పాశ్చాత్య కావ్య సంప్రదాయాన్ని కూడా గౌరవించి తమ విమర్శను కొనసాగించారు. పాటిబండ మాధవ శర్మ 'ఆధునికాంధ్ర భావ కవిత్వం' అనే లఘు సిద్ధాంత వ్యాసాన్ని పింగళి లక్ష్మీకాంతం గారి పర్యవేక్షణలో రాశారు. విశ్వవిద్యాలయాల్లో తెలుగు సాహిత్య పరిశోధన పురిటి నొప్పులు పడుతున్న రోజులవి. ఆ దినాల్లో పాతికేళ్ల పాటిబండ వారు ఎంతో శ్రమకోర్చి పత్రికల్లో చెల్లాచెదురుగా పడి ఉన్న కవితల్ని పోగు చేసి, శ్రద్ధతో పరిశీలించి ఆత్మవిశ్వాసంతో సంతరించి పెట్టిన ఆత్మ మూల్య పరిశోధనా గ్రంథం ఇది. పాటిబండ్ల వారు పుస్తకం చివరి పేజీల్లో భావ కవిత్వ వికాసాన్ని సమీక్షిస్తూ, భావకవుల కవిత్వంలోని వైశిష్ట్యాన్ని వివరించిన విధానం గమనించదగ్గది. దక్షిణాంధ్ర యుగ నాయక రాజుల చరిత్ర, సాహిత్య పోషణల గురించి పరిశోధన చేసి దానికి ఇనాలోక యోగం కల్పించిన పరిశోధకుల్లో ప్రథమగణ్యులు వేటూరి ప్రభాకరశాస్త్రి గారు. మెకంజీ కైఫియత్తులు, లిఖిత తాళపత్ర గ్రంథాలు, ప్రాచీన సంస్క ృతాంధ్ర కావ్య నాటకాదుల్ని గాలించి 1914లో 'తంజావూరు ఆంధ్ర నాయక చరిత్ర'ను రచించి పాఠక లోకానికి అర్పించారు. దక్షిణాంధ్ర యుగ చరిత్ర సాహిత్యాన్ని అంచనా వేసిన తొలి విమర్శనా గ్రంథం ఇదే.

నిడదవోలు వెంకటరావు గారి 'ఆంధ్ర కర్ణాటక సారస్వతములు– పరస్పర ప్రభావము' తెలుగు కన్నడ ప్రాచీన కావ్యాల తులనాత్మక పరిశీలనకు ప్రేరణ కలిగించింది. లోతైన అధ్యయన, అనుశీలనకు దారితీసింది. కోలా శేషాచల కవి 'నీలగిరి యాత్ర'ను వినోదయాత్ర కథనంగా రూపొందిస్తే, బేతపూడి సుందర రాయుడు 'నీలగిరి చరిత్ర'ను అటు ఉల్లాస యాత్ర గాను, ఇటు విజ్ఞాన యాత్రగా తీర్చిదిద్దారు. 'జానకమ్మ ఇంగ్లాండ్ యాత్ర' ఆషామాషీ వ్యవహారం కాదు. ఆ కాలం రీత్యానే కాదు, ఈ కాలం దృష్టితో చూసినా ఇది బహుళార్థ సాధక పర్యటనమే. ఆమె కొత్త ప్రదేశాల్ని చూసే చూపు, సుఖసంతోషాల్ని అనుభవించే రీతి, అక్కడి ప్రజల ఆచార వ్యవహారాలని, పండుగ పబ్బాల్ని పరిశీలించి, పులకరించే విధానం, ఆ ప్రాంతపు నాగరికత– సంస్క ృతిని ఆకళించుకునే వైనం గొప్పగా అనిపిస్తాయి. సిపి బ్రౌన్ 'తాతాచారి కథలు'కు ముందు మాటలు రాస్తూ బంగోరే ఇలా అంటారు : 'బ్రౌన్ ఈ కథలను ఎందుకు సేకరించినట్లు? వీటిలోని భాషా సారళ్యం, సూటిదనం ఒకటే కారణమా? లేక ఇతివృత్తం కూడానా. చారిత్రిక అంశాలు ఉన్నాయనే స్పృహ కూడా ఒక కారణమా? స్పెక్యులేట్ చేయడం కష్టం. బ్రౌన్ వ్యక్తిత్వం ఒక మూసలో ఇమిడేది కాదు. ఒక కొలమానానికి అందేది కాదు. ఆయన పాండితి, ప్రజ్ఞ, సేవ బహుముఖమైనవి. గుడిపూడి సుబ్బారావు రాసిన 'మునగాల పరగణా : కథలు–గాథలు'లో మనకు జమీందారుల భోగ విలాసాలు, డాబు దర్పాలు, పీడన తాడనలు, ప్రజల ఆక్రందనలు, ఆర్తనాదాలు కనబడతాయి, వినిపిస్తాయి. ఆదిరాజు వీరభద్రరావు రచించిన 'షితాబుఖాన్ అను సీతాపతి రాజు' పరిశోధన గ్రంథం కాకతీయుల తర్వాతి కాలం నాటి ఒక వీరుని శౌర్య చరిత్ర, తెలంగాణ చరిత్రలోని ఒక స్మరణీయ అధ్యాయం. 'జనం మంచి శేషాద్రి శర్మ గారి షష్టిపూర్తి ఉత్సవ సన్మాన సంపుటము' కొండంత కవిని అద్దంలో కొంచంగా చూపించే అభినందన గ్రంథం. తెలంగాణ ప్రజలు పోరాడి అస్తిత్వ అస్మితలను నిరూపించిన నేపథ్యంలో దేవులపల్లి రామానుజ రావు గారి '50 సంవత్సరాల జ్ఞాపకాలు' రచింపబడింది. అయ్యంకి వెంకట రమణయ్య గారు ఎన్నో రాష్ట్రాల్లో గ్రంథాలయాల స్థాపనకు ప్రేరకశక్తిగా నిలిచారు. గ్రంథాలయాల ఆవశ్యకతను పుస్తకాల ఎన్నిక, సేకరణ, వర్గీకరణ పాఠకుల అభిరుచులు పల్లెల్లో పట్టణాల్లో స్థాపించవలసిన గ్రంథాలయాల స్వరూప స్వభావాల గురించి చేసిన ఉపన్యాసాలు రాసిన వ్యాసాన్ని వెలగా వెంకటప్పయ్య గారు ఎంతో శ్రమించి చక్కగా కూర్చి 'గ్రంథాలయ జ్యోతి' అనే గ్రంథాన్ని సిద్ధపరిచారు.

అలభ్య గ్రంథాలను సేకరించడం ఒక ఎత్తు. వాటిని క్షుణ్ణంగా చదివి అందులోని ప్రత్యేకతలను, గొప్పదనాన్ని విశ్లేషించి వివరించడం మరో ఎత్తు. ఈ పనిని ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ సమర్థవంతంగా చేశారని చెప్పుకోవచ్చు. అయితే ఈ పుస్తకాలు వెలువడిన కాలానికి ఇప్పటికే ఎన్నో నూతన పరిశోధనలు జరిగి, మరెన్నో కొత్త విషయాలు బయటపడటంతో, వాటి ఆధారంగా కొత్త పుస్తకాలు వస్తూనే ఉన్నాయి. వాటితో పోల్చుకొని చూస్తే ఈ పుస్తకాలు కాలదోషం పట్టినవిగా, అవుట్ డేటెడ్ అని పరిగణించే అవకాశం ఉన్నది. అయినప్పటికీ పాత తరం వారి పాండిత్యం, పరిశోధనా పటిమ ఈతరం పాఠకులు తెలుసుకోవడానికి ఇలాంటి పుస్తకాలు ఉపయోగపడతాయి. 'గ్రంథాంతరంగం' పుస్తకాన్ని ఎమెస్కో ప్రచురించింది.

– కె.పి.అశోక్ కుమార్

ఇక్కడ శవాలు అమ్మబడును!

ఎక్కడెక్కడో వెతక్కండి ఇక్కడికి రండి
కాగితాలకు, విచారణలకు పని చెప్పొద్దు
ఎక్కడికో వెళ్ళి ఫిర్యాదులు చేయకండి
కాళ్లరిగేలా తిరిగి మతిభ్రమించేలా ఆలోచించి
జనాభా లెక్కల్లో ఉండకుండా పోవద్దు
లెక్కలు తేలాలంటే
నిశ్శబ్దంగా ప్రవహించే నేత్రావతి నీళ్ళనడగండి
ఆర్తనాదాల స్వరం వినాలంటే
తీరం వెంట ఏపుగా పెరిగిన చెట్లను అడగండి

ఎక్కడెక్కడో వెతక్కండి ఇక్కడికి రండి
ఫిర్యాదులు, ఫిర్యాదులను చుట్టిన ఎఫ్ఐఆర్లు,
ఎఫ్ఐఆర్లను మోసిన క్రైం డైరీలు
తళ తళమెరిసే మా నోట్ల కట్టలముందు
నగ్నంగా నృత్యం చేస్తాయి.
మిమ్మల్ని ఇక్కడ ఎవ్వరూ ఏమీ అనరు
మీరు వచ్చి మీ వాళ్ళ ఆనవాళ్లను పట్టుకుపోండి!

ఎక్కడెక్కడో వెతక్కండి ఇక్కడికి రండి
ఇది ధర్మ సంత
ఈ సంతలో మీ పిల్లల కళేబరాల్ని
కాస్త మిగిలిన అవశేషాలని
అమానుష మారణ హత్యాకాండ
ఆధారాలను తీసుకెళ్లి
జ్ఞాపకాలుగా ఉంచుకోండి.
ఈ ధర్మ మట్టిలో కలిసిపోయిన
మీ పిల్లల దేహాలు కూడా ధర్మానికి ప్రతిరూపమే..
ఎందుకంటే ధర్మం మాకు బానిస!

ఎక్కడెక్కడో వెతక్కండి ఇక్కడికి రండి
మీరు ధైర్యంగా నిరభ్యంతరంగా
కుళ్ళిన ఎముకల్ని, అస్థి పంజరాల్ని తవ్వుకొని తీసుకెళ్ళండి
మాయమైన అతివల ఆర్తనాదాలను మీరెక్కడ వింటారు?
ఏ ఊర్లో వినిపించవు?
ప్రాణం పోయిన చోట కాకుండా
ఎక్కడెక్కడో ఎందుకు వెతుకుతారు?

ఎక్కడెక్కడో వెతక్కండి ఇక్కడికి రండి
ఎవరికెవరిరో ఎందుకు చెబుతారు
ఖాకీ ఖద్దరు సాక్షిగా చేసిన దారుణ దుర్మార్గ కామక్రీడలివి
ఎక్కడో ఉంటే వెతికిచ్చేది చట్టం
ఆనవాలు ఆధారాలు ఆర్తనాదాలు అకృత్యాలు అమానుషాలు
నిఘంటువుల్లో లేని రాక్షసత్వానికి అర్థాలన్నీ
ఈ ధర్మక్షేత్రంలోనే దొరుకుతాయి.
అన్నీ ఇక్కడే ఉన్నప్పుడు వెతకడం దేనికి!

ఎక్కడెక్కడో వెతక్కండి ఇక్కడికి రండి
మీ పిల్లల దేహాలపై చిమ్మిన, చిందిన రక్తం
నెత్తుటి ప్రవాహాల్ని
ధర్మస్థల మట్టి కలిపేసుకుంది
ఆయువు పంచభూతాల్లో కలిసిపోయింది..
అందుకే అవన్నీ ఈ ధర్మ సంతలో చూడొచ్చు
మీరు రాసుకున్న చట్టాలు
మీరు విశ్వసించే రాజ్యాంగం
మా పాదాల కింద నలిగే బానిసే
ధర్మం పేరుతో రక్తపు మరకల చరిత్రను రాయడం మాకు కొత్తేం కాదు
ధర్మ పరిరక్షణ పేరుతో న్యాయాన్ని చంపడమూ కొత్త కాదు
మా మాట ఎవరికైనా వేదవాక్కు మా మాట ఎవరికైనా శాసనం
మా మాట ఎవరికైనా చట్టం మా మాట ఎవరికైనా ఆదేశమే
ఎందుకంటే మేము ధర్మ ప్రభువులం
ఎందుకంటే మేము పద్మశ్రీలం
ఎందుకంటే మేము పద్మభూషణులం
రాజ్యం మాదే రాజ్యసభ మాదే
మా నేత ప్రపంచ నేత
మా నేత ప్రపంచ నియంత!

– కెంగార మోహన్
90007 30403

పార్లమెంట్ నుంచి ఇసి కార్యాలయం వరకూ

నేడు 'ఇండియా' ఎంపిల మార్చ్


న్యూఢిల్లీ : ఎన్నికల్లో, ఓటర్ల లిస్టుల్లో మోసాలకు వ్యతిరేకంగా సోమవారం ఇండియా వేదికలోని పార్టీల ఎంపిలు మార్చ్ నిర్వహించనున్నారు. ఢిల్లీలోని పార్లమెంట్ నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకూ ఈ మార్చ్ జరుగుతుంది. అలాగే సోమవారం సాయంత్రం చాణక్యపురిలోని హోటల్ తాజ్ ప్యాలెస్‌లో ఇండియా వేదిక ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విందు ఇవ్వనున్నారు.

పిహెచ్‌డి విద్యార్థి మృతిపై ఐఐఎస్ఇఆర్ నిజనిర్ధారణ కమిటీ

కొల్‌కతా : పిహెచ్‌డి విద్యార్థి అనంతిరా రాయ్ (24) ఈ నెల 8న అనుమానాస్పదంగా మరణించడంపై విచారణకు కొల్‌కతాలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఇఆర్) నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని ఇనిస్టిట్యూట్ అధికార ప్రతినిధి ఆదివారం వెల్లడించారు. నడియా జిల్లా హరింగత క్యాంపస్‌లోని లైఫ్ సైన్స్ పరిశోధనా విద్యార్థి రాయ్ ఈ నెల 8న ఉదయం అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఎయిమ్స్ కల్యాణి ఆసుపత్రికి తరలించారు. కొన్ని గంటల్లోనే ఆయన మరణించారు. ఆసుపత్రి నుంచి అందిన ప్రాథమిక నివేదిక ప్రకారం అధిక మోతాదులో డ్రగ్స్ తీసుకోవడమే విద్యార్థి మరణానికి కారణమని ఒక పోలీసు అధికారి తెలిపారు. సహచర విద్యార్థులు దీన్ని ఖండిస్తున్నారు. మృతి చెందడానికి ముందురోజు రాత్రి రాయ్‌తో కొంతమంది ల్యాబ్‌లో ఘర్షణ పడ్డారని చెబుతున్నారు. రాయ్ బంధువు ఒకరు మాట్లాడుతూ పరిశోధనా బృందంలోని ఇద్దరు అతనిపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారని చెప్పారు. మానసిక వేధింపులు, తీవ్ర బెదిరింపులకు పాల్పడుతున్నారని రాయ్ సోషల్ మీడియాలో చేసిన పోస్టుల ఆధారంగా అతని కుటుంబ సభ్యులు హరింగత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎఫ్ఐఆర్ నమోదైంది. మృతుడి కుటుంబ సభ్యుల్ని ఎస్ఎఫ్ఐ కార్యదర్శి దేబాంజన్ డే పరామర్శించారు. ఈ మృతిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఐఐఎస్ఇఆర్ ప్రకటించింది. 'కమిటీ అన్ని కోణాలను పరిశీలిస్తుంది. విద్యార్థి తల్లిదండ్రులతోనూ, కుటుంబ సభ్యులతోనూ, బ్యాచ్‌మేట్లతోనూ మాట్లాడుతుంది. సోషల్ మీడియా పోస్టులను తనిఖీ చేస్తుంది. మేం పోలీసులకు సహకరిస్తాం' అని ఇనిస్టిట్యూట్ అధికార ప్రతినిధి తెలిపారు.

బిజెపి అనుబంధ సంస్థలా ఎన్నికల సంఘం

- సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ ఆగ్రహం



తిరువనంతపురం : రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన స్వతంత్ర సంస్థ అన్న విషయాన్ని విస్మరించిన కేంద్ర ఎన్నికల సంఘం బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి అనుబంధ సంస్థలా వ్యవహరిస్తోందని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ విమర్శించారు. తిరువనంతపురంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత లోక్‌సభ ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ ప్రచురించిన ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న అక్రమాలపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కొన్ని 'విస్ఫోటక ఆరోపణలు' చేశారని చెప్పారు. బిజెపి ప్రభుత్వం సుప్రీంకోర్టు సూచనలు పరిగణనలోకి తీసుకోకుండా తనకు విధేయులైన వారిని ఎన్నికల కమిషన్‌లో నియమించిందని, వారు ఇప్పుడు తప్పుడు పనులు చేస్తున్నారని తెలిపారు. 'ఒకవైపు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో నిజమైన ఓటర్లను తొలగిస్తున్నారు. మరోవైపు ఏదైనా ఓ ప్రాంతంలో రెండు సంవత్సరాలకు పైగా కన్పించని వారిని ఓటర్లుగా చేరుస్తున్నారు' అని బేబీ విమర్శించారు. ఏదైనా ఒకచోట కనీసం ఆరు నెలల పాటు నివసించిన వారికే ఓటు హక్కు కల్పించాలని నిబంధన ఉన్నదని, అయితే దానిని ఇసి పాటించడం లేదని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేరళలోని త్రిస్సూర్ నియోజకవర్గంలో 30,000 నకిలీ ఓట్లను బిజెపి చేర్చినట్లు తనకు సమాచారం అందిందని చెప్పారు. సమీప ప్రాంతాలకు చెందిన అనేకమందిని త్రిస్సూర్ లోక్‌సభ నియోజకవర్గ ఓటర్లుగా చేర్చారని, ఈ విషయాన్ని తీవ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉన్నదని బేబీ తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికలలో త్రిస్సూర్ లోక్‌సభ స్థానంలో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన సినీ నటుడు, కేంద్ర మంత్రి సురేష్ గోపి గెలుపొందారు. రాష్ట్రంలో బిజెపి గెలుపొందిన ఒకే ఒక స్థానం ఇదే.

అర్హత ఉన్న ఓటరు పేరు తొలగించబోం

- సుప్రీంకోర్టులో ఇసి అఫిడవిట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లో చేపట్టిన ఓటర్ లిస్ట్ ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) విషయంలో తీవ్రమైన నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఓటర్ల జాబితా నుంచి ఓటర్లను తొలగించారన్న ఆరోపణలను తిరస్కరిస్తూ.. అర్హత ఉన్న ఏ ఓటరు పేరునూ జాబితా నుంచి తొలగించబోమని పేర్కొంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ క్యాంపెయిన్ (ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. పలు రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించడంపై సమాధానం చెప్పాలని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఆగస్టు ఒకటిన ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితా నుంచి ఎవరైనా ఓటరు పేరును తొలగించే ప్రక్రియ నిబంధనల ప్రకారం జరుగుతుందని కమిషన్ అఫిడవిట్‌లో పేర్కొంది. పేరును తొలగించే ప్రతిపాదన, అందుకు సంబంధించి కారణాలను ఓటరుకు ముందే తెలియజేస్తారన్నారు. ప్రతి ఓటర్‌కు వాదనలు వినిపించేందుకు అవకాశం, సంబంధిత పత్రాలు అందించేందుకు అవకాశం ఇవ్వనున్నట్లు చెప్పింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మొదటి దశ పూర్తయిందని కమిషన్ తెలిపింది. తొలిదశలో దాదాపు 7.24 కోట్ల మంది ఓటర్లు తమకు సంబంధించిన పత్రాలను సమర్పించారని, వీటన్నింటినీ సవరించిన జాబితాలో చేర్చనున్నట్లు తెలిపింది. ఆయా పేర్లన్నింటినీ డిజిటలైజ్ చేశారని, తొలగించబడిన ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలకు అందజేయనున్నట్లు తెలిపింది. తొలి దశను విజయవంతం చేసిన ఘనత బీహార్ ప్రధాన ఎన్నికల అధికారితోపాటు 38 జిల్లాల



ఎన్నికల అధికారులు, 243 మంది ఇఆర్ఒలు, 2,976 మంది ఎఇఆర్ఒలు, 77,895 మంది బిఎల్ఒలు, వాలంటీర్లు, 12 రాజకీయ పార్టీల అధ్యక్షులు, వారు నామినేట్ చేసిన 1.6 లక్షల బిఎల్ఎలకు దక్కుతుందని చెప్పింది. ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఎవరైనా ఓటరు జాబితాలో సవరణల కోసం ఫిర్యాదులతోపాటు అభ్యంతరాలు చెప్పవచ్చని పేర్కొంది.

ఎస్ఐఆర్ ప్రక్రియను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లు విచారించిన సర్వోన్నత న్యాయస్థానం పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగిస్తే వెంటనే జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఆధార్ కార్డ్, ఓటర్ ఐడిలను చెల్లుబాటయ్యే పత్రాలుగా పరిగణించాలని, పేర్లను తొలగించే బదులు చేర్చే ప్రక్రియపై దృష్టి పెట్టాలని సూచించింది. బీహార్ ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన సుమారు 65 లక్షల మంది ఓటర్ల పూర్తి సమాచారాన్ని ఆగస్టు 9 నాటికి సమర్పించాలని ఇసిని సుప్రీంకోర్టు ఈ నెల 6న ఆదేశించింది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్)తోపాటు పలు రాజకీయ పార్టీలకు సైతం అందించాలని సూచించిన విషయం తెలిసిందే.

డిజిటల్ ఓటర్ లిస్ట్‌ను బయటపెట్టాలి

- ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు కలిసి రావాలి
- ఇసిని డిమాండ్ చేసిన రాహుల్ గాంధీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



డిజిటల్ ఓటర్ల జాబితా బయటపెట్టాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆదివారం సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. 'ఓటు దొంగతనం అనేది ఒక వ్యక్తి, ఒక ఓటు అనే ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రంపై దాడి. స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలకు స్వచ్ఛమైన ఓటరు జాబితా అవసరం. మా డిమాండ్ స్పష్టంగా ఉంది. ఎన్నికల కమిషన్ పారదర్శకతను చూపించాలి. డిజిటల్ ఓటర్ లిస్ట్‌ను బయటపెట్టాలి. తద్వారా ప్రజలు, రాజకీయ పార్టీలు దాన్ని స్వయంగా ఆడిట్ చేయాలి. మీరు కూడా మాతో చేరి ఈ డిమాండ్‌కు మద్దతు ఇవ్వొచ్చు. votechori.in/ ecdemand వెబ్‌సైట్‌లోకి వెళ్లండి.. లేదంటే 9650003420 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వండి' అని రాహుల్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ పోరాటం ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికేనని స్పష్టం చేశారు. బెంగళూరు సెంట్రల్‌లోని ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో లక్షకుపైగా ఫేక్ ఓటర్లను గుర్తించామని, ఇవి ఈ లోక్‌సభ స్థానం బిజెపి గెలిచేందుకు సహాయపడిందని తెలిపారు. 70-100 సీట్లలో ఇలా జరిగితే ఎలా ఉంటుందో ఊహించుకోవాలని, ఇది స్వేచ్ఛా ఎన్నికలను నాశనం చేస్తుందని చెప్పారు. ఒక వ్యక్తి పోర్టల్‌లో నమోదు చేసుకునే సమయంలో 'ఓటు దొంగతనం'కు వ్యతిరేకమని పేర్కొంటూ.. అతని పేరుపై ఓ సర్టిఫికెట్ జారీ చేయబడుతుందన్నారు. ఈ సర్టిఫికెట్‌పై కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, ఆ పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్ సంతకాలుంటాయి.

రాహుల్ గాంధీకి కర్ణాటక ఎన్నికల ప్రధానాధికారి నోటీసులు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కర్ణాటక ఎన్నికల ప్రధానాధికారి (సిఇఒ) నోటీసులు జారీ చేశారు. ఓ మహిళ రెండుసార్లు ఓటు వేశారన్న రాహుల్ ఆరోపణలపై సిఇఒ స్పందించారు. ఆరోపణలకు సంబంధించి పత్రాలను సమర్పించాలని కోరారు. ఆధారాలు సమర్పిస్తే పూర్తిస్థాయి విచారణ జరుపుతామని కర్ణాటక సిఇఒ తెలిపారు.

ఇస్లాంపూర్ ఇకపై ఇషావర్‌పూర్..

- పేరు మార్చిన బిజెపి పాలిత మహారాష్ట్ర సర్కార్

ముంబయి : ఇస్లాంపూర్‌ను ఇషావర్‌పూర్‌గా మారుస్తూ మహారాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకున్నది. ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఛత్రి నిజాంపూర్‌ను రాయ్‌గడ్‌వాడీగా మార్చనున్నట్లు తెలిపారు. ఇస్లాంపూర్ పేరును మార్చాలని హిందూ సంఘాలు 1980 నుంచి డిమాండ్ చేస్తున్నాయి.

బెంగళూరులో ఎల్లో మెట్రోలైన్ ప్రారంభం

- కర్ణాటక సిఎం, డిప్యూటీ సిఎంతో ప్రధాని మెట్రో రైడ్
- రాష్ట్ర ప్రభుత్వ నిధులే అధికం : సిద్ధరామయ్య

బెంగళూరు : ప్రధాని మోడీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ కలిసి ఆదివారం మెట్రో రైడ్ చేశారు. బెంగళూరులో ఎల్లో మెట్రో లైన్ ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీ ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌వి రోడ్ మెట్రో స్టేషన్‌లో ప్రధానికి సిఎం ఆహ్వానం పలికారు. డిప్యూటీ సిఎం డికె శివకుమార్ ప్రాజెక్టు వివరాలను ప్రధానికి వివరించారు. కార్యక్రమం పూర్తయ్యాక ముగ్గురు నేతలు కలిసి కొత్త మెట్రో రైలులో ప్రయాణించారు. కార్యక్రమానికి ముందు ప్రధాని మోడీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి టికెట్ కొనుగోలు చేశారు. అనంతరం ఎల్లో లైన్ మెట్రో సేవలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ మార్గం బెంగళూరు సెంట్రల్ డిస్ట్రిక్ట్‌ను టెక్ హబ్ అయిన ఎలక్ట్రానిక్స్ సిటీతో



మెట్రో రైలులో ప్రధాని మోడీ

కలుపుతుంది. ప్రధానితోపాటు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 16 మంది విద్యార్థినిలు, ఎనిమిదిమంది చిన్నారులు, ఎనిమిది మంది మెట్రో కార్మికులు ఈ రైలులో ప్రయాణించారు. వారితో ప్రధాని ముచ్చటించారు.

దేశీయ సాంకేతికత, మేక్ ఇన్ ఇండియాతోనే 'ఆపరేషన్ సిందూర్' విజయం : ప్రధాని మోడీ

'ఆపరేషన్ సిందూర్' విజయం వెనుక భారతీయ సాంకేతికత, మేక్ ఇన్ ఇండియా ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. దేశీయ టెక్నాలజీ, మేక్ ఇన్ ఇండియా కొన్ని గంటల్లో పాకిస్తాన్?ను మోకరిల్లేలా చేశాయన్నారు. 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా ప్రపంచం మొదటిసారిగా భారతదేశం తాలుకా కొత్త ముఖాన్ని చూసిందని, పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలను నాశనం చేయడంలో దాని సామర్థ్యాన్ని ప్రదర్శించిందని స్పష్టం చేశారు.

కర్ణాటకకూ ప్రాధాన్యత ఇవ్వండి : సిద్ధరామయ్య

మెట్రో ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వ నిధుల కంటే రాష్ట్ర ప్రభుత్వ నిధులే అధికమని కర్ణాటక సిఎం సిద్ధరామయ్య చెప్పారు. రాష్ట్రం రూ.25,387 కోట్లు ఖర్చు చేస్తే, కేంద్రం రూ.7,468 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని చెప్పారు. కేంద్రం ఇచ్చిన నిధుల్లో ఎక్కువ భాగం రుణాలు, ఈక్విటీ రూపంలో ఇచ్చిందన్నారు. రాష్ట్రం వడ్డీతో సహ తిరిగి చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఇప్పటివరకూ 3,987 కోట్లు తిరిగి చెల్లించామని తెలిపారు. మహారాష్ట్ర, గుజరాత్‌లకు ఇచ్చిన ప్రాధాన్యత కర్ణాటకకు కూడా ఇవ్వాలని కోరారు. బెంగళూరు మెట్రో ఎల్లోలైన్‌కు కేంద్రం 20 శాతం మాత్రమే నిధులిచ్చిందని డిప్యూటీ సిఎం డికె శివకుమార్ తెలిపారు.

విజేతల మెజారిటీల కంటే తొలగింపులే అధికం

- బీహార్‌లో 24 లోక్‌సభ స్థానాల్లో ఇదే పరిస్థితి

పాట్నా : కేంద్ర ఎన్నికల సంఘం ప్రచురించిన బీహార్ ముసాయిదా ఓటర్ల జాబితాలో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలో 40 లోక్‌సభ స్థానాలు ఉండగా వాటిలో 24 స్థానాలలో తొలగించిన ఓటర్ల సంఖ్య గత లోక్‌సభ ఎన్నికలలో విజేతలు సాధించిన మెజారిటీ కంటే ఎక్కువగా ఉండడం గమనార్హం. అంటే దీనర్థం ఏమిటి? జాబితాల నుంచి తొలగించబడిన ఓటర్లు బీహార్‌లోని సగానికి పైగా లోక్‌సభ స్థానాల ఫలితాలను నిర్ణయించడంలో కీలకంగా మారి ఉండవచ్చునని అర్థమవుతోంది. వివిధ సందర్భాలలో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన డేటాను 'ది క్వింట్' పోర్టల్ విశ్లేషించింది. ఉదాహరణకు బిజెపి నాయకుడు గిరిరాజ్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న బెగూసరాయ్ లోక్‌సభ స్థానంలో 2024 ఎన్నికల సమయంలో 22,00,435 మంది ఓటర్లు ఉన్నారు. 'సర్' కసరత్తు తర్వాత వారి సంఖ్య 20,77,257కు తగ్గింది. అంటే 1,23,178 మంది ఓటర్లు తగ్గిపోయారు. లోక్‌సభ ఎన్నికలలో గిరిరాజ్ సింగ్‌కు వచ్చిన మెజారిటీ 81,480 ఓట్లే. ఈ విధంగా తొలగించిన ఓటర్ల సంఖ్యతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికలలో విజేతలకు వచ్చిన మెజారిటీ తక్కువగా ఉన్న స్థానాలలో వాల్మీకి నగర్, పూర్వి చంపారన్, షియోహర్, సీతామర్హి, అరారియా, కిషన్‌గంజ్, కతిహార్, పూర్నియా, వైశాలి, గోపాల్‌గంజ్, సివాన్, మహరాజ్‌గంజ్, సరన్, ఉజెయిర్‌పూర్, బెగూసరాయ్, భాగల్పూర్, బంకా, ముంగర్, పాటలీపుత్ర, అర్రా, బక్సర్, కారాకట్, ఔరంగాబాద్, నవాడా ఉన్నాయి. ఈ 24 స్థానాలలో 16 స్థానాలను జెడియు, బిజెపి, హెచ్ఎఎం, ఎల్‌జెపి గెలుచుకున్నాయి. ఐదు స్థానాలలో కాంగ్రెస్ - ఆర్‌జెడి విజయం సాధించగా, రెండు చోట్ల సిపిఐ (ఎంఎల్), ఒక చోట స్వతంత్రుడు గెలుపొందారు. షియోహర్ స్థానంలో గత లోక్‌సభ ఎన్నికల తర్వాత 1,09,723 ఓట్లను తొలగించారు. అక్కడ జెడియు అభ్యర్థి కేవలం 29,143 ఓట్ల మెజారిటీతో గట్టెక్కారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు, 2020 శాసనసభ ఎన్నికలకు మధ్య ఈ నియోజకవర్గంలో 69,867 మంది ఓటర్లు కొత్తగా నమోదవడం గమనార్హం. పూర్వి చంపారన్, అరారియా, సీతామర్హి వంటి కొన్ని స్థానాలలో కూడా ఆ సమయంలో ఓటర్లు పెరిగారు. తొలగించిన ఓటర్లకు సంబంధించి ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) వ్యవస్థాపకుడు జగదీప్ ఛోకర్ అభిప్రాయపడ్డారు.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని మృతి

ప్రజాశక్తి- నెల్లూరు



హేమశ్రీ (ఫైల్)

నెల్లూరు నగరంలోని ఆర్ఎస్ఆర్ ప్రయివేట్ జూనియర్ కళాశాల హాస్టల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని హేమశ్రీ (16) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. హాస్టల్ గదిలో ఉరికి వేలాడుతూ కనిపించింది. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థిని తల్లిదండ్రుల కథనం ప్రకారం... తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాస్యపాళెం గ్రామానికి చెందిన హేమశ్రీని ఆర్ఎస్ఆర్ కళాశాలలో చేర్పించారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తల్లిదండ్రులకు హేమశ్రీ తెలిపింది. దీంతో, ఆదివారం వచ్చి ఇంటికి తీసుకెళ్తామని ఆమెకు వారు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కళాశాల యాజమాన్యం నుంచి విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ వచ్చింది. హేమశ్రీ ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉందని చెప్పడంతో వారు హుటాహుటిన కళాశాలకు చేరుకున్నారు. అయితే, అప్పటికే తమ కుమార్తె చనిపోయి ఆస్పత్రిలో ఉన్నట్లు తెలిసి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. తమ కుమార్తె మృతికి కారణాలు వెల్లడించాలని కళాశాల యాజమాన్యాన్ని హేమశ్రీ కుటుంబ సభ్యులు నిలదీయడంతో యాజమాన్యం కళాశాలకు తాళాలు వేసి వెళ్లిపోయింది. వేదాయపాళెం, నవాబుపేట స్టేషన్ల నుంచి పోలీసులు కళాశాలకు వచ్చి హేమశ్రీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కు తరలించారు.

కళాశాల ఎదుట విద్యార్థిని తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల ధర్నా
ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ మద్దతు

హేమశ్రీ మృతికి యాజమాన్యమే కారణమంటూ కళాశాల ఎదుట విద్యార్థిని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు ధర్నా చేశారు. వారికి ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్ను నరేంద్ర, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బిబి నరసింహ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని ధర్నా చేస్తున్న వారిని చెదరగొట్టారు. ఎస్ఎఫ్ఐ, డిఐవైఎస్ నాయకులను అరెస్టు చేసి జీపులో పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అరెస్టులు దారుణం : సిపిఎం, ఐద్వా

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకుల అరెస్టును సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, ఐద్వా రూరల్ కమిటీ నాయకులు షేక్ షాహినా బేగం ఖండించారు. విద్యార్థిని మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

జీవన సారథం

విజయం కోసం చేసే ప్రతి ప్రయత్నమూ సఫలం కాకపోవచ్చు. కానీ ప్రయత్నమే చేయకపోతే ఏ ఫలితమూ రాదు.

మీ కోసం

తులసి ఆకులు నీళ్లలో వేసుకొని ప్రతిరోజు తాగుతుంటే గొంతు ఇన్ఫెక్షన్ తగ్గుతుంది.



మితమే హితం!



అర్ధరాత్రి నిద్రపోతున్న సమయంలో పదేళ్ల రఘుకి కడుపునొప్పి మొదలైంది. ఒక్కసారిగా మెలకువ వచ్చింది. ఇంతలో రఘు చెవికి ఏదో వాదులాట వినిపించసాగింది.

'ఏయ్ నోరూ! ఒళ్ళు దగ్గర పెట్టుకో, నీ వలన నేను ఇప్పుడు ఇబ్బంది పడుతున్నాను' అంటుంటే, 'నన్ను నిందించడానికి నువ్వెవరవి?' తిరిగి నోరు నిలదీసింది.

'నీలాగే నేను కూడా నోరు వలన ఇబ్బంది పడే రోజులున్నాయి మిత్రమా! ఈ రోజు అయితే భరించలేని నొప్పితో చర్మం ఎరుపెక్కిపోయింది' బాధపడుతూ చెప్పింది ఇంకొక గొంతు.

'ఎవరివి ఈ గొంతులు?' అనుకుంటూ లేచిన రఘు, వంటింటి వైపు అడుగులు వేశాడు. 'ఏయ్..ముక్కు! వాసన గుర్తించి ఈ చీకట్లో ఎక్కడ ఏ తాయిలాం ఉందో చెప్పు' జులుం చూపించింది నోరు.

'నా వల్ల కాదు, జలుబు చేసిందిగా' అసలు విషయం చెప్పింది ముక్కు. 'నువ్వొక దానివి అవసరానికి పనికిరావు' ముక్కును నిందించింది నోరు. ఇంతలో రఘు వంటింటిలో లైటు వేశాడు. 'ఏయ్.. కళ్ళు! వెలుగొచ్చిందిగా.. తినడానికి తాయిలాలు ఎక్కడున్నాయో, చూసి చెప్పు' అజమాయిషీ చేసింది నోరు. 'ఇలా నోరుపారేసుకో బట్టే ఉదయం తరగతి గదిలో ఉపాధ్యాయుడు వీపు సాపు చేశాడు' సతాయించి వెతికే పనిలో పడ్డాయి కళ్ళు. రఘు ఒక డబ్బా మూత తీశాడు. రుచికరమైన తాయిలాం అయితే బాగున్ను అనుకున్న నాలుకకు ఆతృత పెరిగింది. ఆ డబ్బాలో ఉన్న కొద్దిగా వామును తీసి నోట్లో వేసుకొని నమలసాగాడు రఘు.


'రుచికరమైనదేదో తింటావనుకుంటే, వాము వేసుకుంటావా?' అంటూ పెదవి విరిచింది నోరు. 'మంచిపనే చేశాడు. ఇక ఉపశమనం కలిగి ఎంచక్కా విశ్రాంతి తీసుకుంటాను' ఆనందంతో అంది అపరిచిత గొంతు. అప్పుడు రఘుకి అర్థమైంది ఆ మాటలు పొట్టవని. ఇంకొక అపరిచిత గొంతు వీపుదని.

రఘు అడుగుల శబ్ధం విని రఘు తల్లి మేల్కొంది. అప్పుడు రఘు ఏడ్చుకుంటూ తల్లికి కడుపునొప్పి విషయం చెప్పాడు. 'తిండి విషయంలోను, మాట విషయంలోను నోటిని అదుపులో పెట్టకపోతే ఇటువంటి అనర్థాలే జరుగుతాయి. సాయంత్రం ఇష్టమని నూడిల్స్, పానీ పూరి ఇబ్బడిముబ్బడిగా తిన్న విషయం గుర్తుంది కదా! రేపు ఉదయం డాక్టరు గారి దగ్గరకు పోదాం' అంటూ రఘుని ఓదార్చింది తల్లి. 'మితం హితమ'ని పెద్దలు ఊరికే అనలేదు' అనుకుంటూ నిద్రకుపక్రమించాడు రఘు.

- బి.వి.పట్నాయక్,
83098 72913.

నేను గీసిన బొమ్మ





ఎస్‌విఎల్‌వి. సౌందర్య,

10వ తరగతి,
కెవిఐఐటి పొవై స్కూలు,
పొవై టౌన్,
ముంబయి సబర్బన్, ముంబయి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

దంత చికిత్సలో 'పారదర్శక' పద్ధతి

అందమైన చిరునవ్వుకు క్లియర్ అలైన్‌నర్స్ అనే ఆధునిక విధానం అందుబాటులోకి వచ్చింది. దంతాల అమరికను సరిచేయడానికి ఉపయోగించే పారదర్శకమైన, కనిపించని చికిత్సే ఇది. వీటినే 'క్లియర్ బ్రేసెస్' లేదా 'ఇన్విజిబుల్ బ్రేసెస్' అని కూడా పిలుస్తుంటారు. ఇవి దంతాలపై అమర్చినా కూడా పెద్దగా కనిపించవు. తెలుగులో వీటిని 'పారదర్శక దంత అమరికలు' అని అంటుంటారు.



ఎత్తు, వంకర పళ్లను సరిచేయడానికి ఆర్థోడాంటిక్ క్లిప్ల ద్వారా సరిచేయడం మనందరికీ తెలిసిన విషయమే. అలా క్లిప్ ట్రీట్మెంట్ ద్వారా సమస్య తీవ్రతను బట్టి ఏడాది నుంచి రెండేళ్ల వరకూ ఈ వైద్య విధానం సాగుతుంది. ఆ క్లిప్పుకు అలవాటు పడాలి. వైద్యం పూర్తయ్యే వరకూ వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. కొన్ని ఆహార నియమాలు పాటించాలి. వాటిని ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. నోటిలో అమర్చిన క్లిప్పులు, వాటికి సంబంధించిన వైర్లు, రబ్బర్ బ్యాండ్లు వంటి అనేక పదార్థాల వల్ల ఈ చికిత్స కొంత చికాకు కలిగిస్తుంటుంది. మాట్లాడినా, నవ్వినా, నోటిలోని ఈ క్లిప్పులు బయటికి కనిపిస్తాయి. ఇత్యాది కారణాల వల్ల ఈ ట్రీట్మెంట్ చేయించుకోవటానికి కొంత మంది మొగ్గు చూపడం లేదు. అలాంటి వారికి ఈ క్లియర్ అలైన్‌నర్స్ పద్ధతి అందుబాటులో ఉంది.




క్లియర్ అలైన్‌నర్స్

క్లియర్ అలైన్‌నర్స్ అనేది అత్యంత సౌకర్యవంతమైన, నోట్లో క్లిప్పులు కనబడని ఒక నవీన దంత వైద్య విధానం. నోట్లో పూర్తిగా కలిసిపోయి బయటకు కనిపించవు. తయారు చేయడానికి ఆధునిక 3డి ఇంట్రా ఓరల్ స్కాన్ విధానాన్ని ఉపయోగిస్తారు. ఆలా స్కాన్ చేయగా పళ్ళ 3డి నమూనా తయారయిపోతుంది. ఎంపిక చేసుకున్న నమూనా ఆధారంగా పళ్ల వరుసను సరిచేసి అమర్చుతారు. ఈ అలైన్‌నర్స్‌ను రోగులు వారంతట వారే రోజూ తీసేయొచ్చు. మళ్లీ పెట్టుకోవచ్చు. అలా ఇవి వారానికి ఒకసారి మార్చుకోవాలి. అలా కొన్ని వారాలు వీటిని క్రమ పద్ధతిలో ధరించడం ద్వారా పళ్ళ వరస మెరుగుపడే అవకాశం ఉంటుంది. కొన్ని ముఖ్యమైన సందర్భాల్లో అవసరమైతే తాత్కాలికంగా కొన్ని గంటల పాటు వీటిని తీసివేసే వెసులుబాటు కూడా ఉంది.

సౌకర్యవంతంగా ట్రీట్మెంట్

పాత విధానంలో వైర్లు, క్లిప్పులు నోట్లో అమర్చడం వాళ్ళ నోరు మొత్తం నిండిపోయిన అనుభూతి కల్గుతుంది. వీటిని నెలకు ఒక సారి బిగించాలి. అలాగే వైర్లను కూడా మార్చాలి. అందుకోసం నెలకు ఒకసారి ఆర్థోడాంటిస్ట్‌ని వద్దకు వెళ్లాల్సి వస్తుంది. ఈ వైర్లు, క్లిప్లు, తరచూ బిగించడం వల్ల అవి నోట్లో గుచ్చుకుని తాత్కాలికంగా చిన్న అల్సర్లు తయారయ్యే ప్రమాదం ఉంది. తద్వారా నొప్పి, మంట వంటి సమస్యలతో తాత్కాలికంగా బాధ పడాల్సి వచ్చేది. క్లియర్ అలైన్‌నర్స్ విధానంతో దంత వైద్యం సౌకర్యవంతంగా మారిపోయింది. క్లిప్లు, వైర్లు లేకపోవడం వల్ల పెదాలు, బుగ్గల లోపలి భాగాల్లో వైర్లు గుచ్చుకోవడం తగ్గి, హాయిగా ఏ నొప్పి లేకుండా వైద్యం పూర్తయిపోతుంది. పళ్ళు కూడా చాలా సూక్ష్మంగా, అనుకున్న విధంగా ప్రణాళిక ప్రకారం కదిలి అందంగా తయారవుతాయి. నోట్లో కలిసి పోవడం వల్ల ఈ వైద్యం చేయించుకుంటున్నట్టు ఎవరికీ తెలియదు. యువతీయువకులు, వృత్తి రీత్యా నలుగురితో సంభాషణలు చేసేవారికి చాలా ఉపయోగం.



క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం

క్లియర్ అలైన్‌నర్స్ విధానం ద్వారా అన్ని రకాల పళ్ళ ఎత్తు, వంకర, పళ్ళ మధ్యలో సందులు, పళ్ళు దవడ ఎముకలో ఉండిపోయి బయటకు (అనగా నోటిలోకి) రానివి, దవడ ఎత్తు వల్ల పళ్ళ ఎత్తు వంటి క్లిష్టమైన సమస్యలు కూడా సరిచేయగలిగేంత ఆధునిక పరిజ్ఞానం ఇప్పుడు అందుబాటులో ఉంది. అలైయినర్లతో అనుసంధానమయ్యే మినీ ఇంప్లాంట్లు కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చేశాయి. చిన్న పిల్లలకు కూడా ఉపయోగించదగ్గ ఆధునిక పరిజ్ఞానం, ఇప్పుడు అంటుబాటులో ఉంది.

ఆర్థోడాంటిక్ వైద్య ప్రక్రియలన్నీ ఇప్పుడు అలైన్‌నర్స్ విధానం ద్వారా చేయగలిగేటట్టు పరిజ్ఞానం రూపాంతరం చెందింది. క్లియర్ అలైన్‌నర్స్ విధానం ద్వారా ఆధునిక పరిజ్ఞానంతో , పేషెంటుకు అత్యంత సుఖంగా, సౌకర్యంగా, ఉండటం వల్ల ఈ విప్లవాత్మకమైన పద్ధతి ఆర్థోడాంటిక్ దంత వైద్యాన్ని పూర్తిగా మార్చివేసింది. ఇంతకు మునుపు పళ్ళు ఎత్తుగా ఉండి, వాటిని క్లిప్ ట్రీట్మెంట్ ద్వారా సరిచేయుంచుకోవడానికి సంకోచించే వారికి క్లియర్ అలైన్‌నర్స్ విధానం ద్వారా సరిచేయించుకోవచ్చు.

అంశం	పాత క్లిప్ ట్రీట్మెంట్	నూతన క్లియర్ అలైన్‌నర్స్ విధానం
నోట్లో అమరిక	ఫిక్స్(ఇవి పళ్లకు అతికించబడతాయి)	రిమూవబుల్ (ఇవి కావలసినప్పుడు తీసివేయవచ్చు)
ఆహార నియమాలు	పాటించాలి (లేకపోతే ఇవి ఊడిపోతాయి)	పాటించనవసరంలేదు (వీటిని తినే సమయంలో తీసివేయాలి)
శుభ్రం చేసుకోవడం	జటిలం	తేలిక
సౌకర్యం	అలవాటు పడేంతవరకు అసౌకర్యంగా ఉంటాయి	చాలా సౌకర్యంగా ఉంటాయి
నూతన ట్రీట్మెంట్ యొక్క ఫలితం	పేషెంట్‌కు ముందుగానే చూపించలేము	పేషెంట్‌కు ముందుగా చూపించొచ్చు
ఎదుటి వ్యక్తులకు కనపడే విధానం	క్లిప్లు, వైర్లు ఎదుటి వారికి స్పష్టంగా కనబడతాయి	అలైన్‌నర్స్ ఎదుటివారికి కనిపించవు
వైద్యం చేయించుకునే వయస్సు	13 ఏళ్ళ లోపు పిల్లకు పూర్తి వైద్యం సాధారణంగా సాధ్యపడదు	7 ఏళ్ళ వయస్సు నుండి పిల్లలకు ఈ విధానం ద్వారా వైద్యం చేయొచ్చు



– డాక్టర్ వర్ణన కొత్తూరు
ఎండిఎస్
ఆర్థోడాంటిస్ట్,
క్లియర్ అలైన్‌నర్స్ నిపుణులు,
విజయవాడ.

ఇఆర్‌సిలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయా?

- సుప్రీంకోర్టు సూటి ప్రశ్న
- ప్రజల కోసమే విద్యుత్ అని స్పష్టీకరణ


న్యూఢిల్లీ : విద్యుత్ నియంత్రణ కమిషన్లు (ఇఆర్‌సిలు) స్వతంత్రంగా పనిచేస్తున్నాయా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రెగ్యులేటరీ ఆస్తుల నిర్వహణ, ఖర్చు రికవరీలో జాప్యానికి వ్యతిరేకంగా ఢిల్లీ విద్యుత్ నియంత్రణ కమిషన్ (డిఇఆర్‌సి), విద్యుత్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎపిటిఇఎల్)ను సవాల్ చేస్తూ బిఎస్ఇఎస్ రాజధాని పవర్ లిమిటెట్, ఇతర భాగస్వామ్యులు వేసిన పిటిషన్ విచారణలో భాగంగా జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ఈ ప్రశ్న వేసింది. ప్రజల కోసమే విద్యుత్ అని స్పష్టం చేసింది. సమాజంలో అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా, అందుబాటులో ధరలు లభించేలా చూడటమే విద్యుత్ నియంత్రణ కమిషన్ల (ఇఆర్‌సిలు) విధులని కొన్ని రోజుల క్రితం ఇచ్చిన తీర్పులో పేర్కొంది. ఇందులో భాగంగా ప్రభుత్వాలతో కలిసి పని చేయాలని తెలిపింది. 2003 విద్యుత్ చట్టం ప్రకారం ప్రజాప్రయోజనాల కోసం విద్యుత్‌ను విక్రయించడం, పంపిణీ చేయడం, మార్కెట్ శక్తుల ప్రభావం లేకుండా చూసుకోవడానికి విద్యుత్ నియంత్రణ కమిషన్లు (ఇఆర్‌సిలు)ను ఒక రక్షణ కోటగా పనిచేయడానికి ఉద్దేశించారని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఇఆర్‌సిలు ఈ విధంగా పని చేస్తున్నాయా.. అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. చట్టం ప్రకారం తమకు కల్పించబడిన స్వతంత్రత, స్వయం ప్రతిపత్తికి అనుగుణంగా ఇఆర్‌సిలు పనిచేయడంపై సుప్రీంకోర్టు సందేహం వ్యక్తం చేసింది. విద్యుత్ టారిఫ్‌లను నిర్ణయించడంలో ఇఆర్‌సిలు ప్రత్యేక అధికారాన్ని కలిగి ఉంటాయని గుర్తు చేసింది. చట్ట ప్రకారం ఇఆర్‌సిలు నిర్ణయించిన విద్యుత్ టారిఫ్‌లు సరఫరా ఖర్చును ప్రతిబింబించాలని, క్రాస్ సబ్సిడీలను తగ్గించాలని తెలిపింది. కానీ.. విద్యుత్ పంపిణీ కంపెనీల రెగ్యులేటరీ ఆస్తిని చట్టం అంగీకరించిన పరిమితికి మించి అనుమతించడం ద్వారా, విద్యుత్ టారిఫ్‌లను భారీగా పెంచడానికి ఇఆర్‌సిలు 'నిర్వహణ, యుక్తి' వ్యూహాలను అనుసరిస్తున్నాయని సుప్రీంకోర్టు విమర్శించింది. విద్యుత్ టారిఫ్‌లు నిర్ణయించడానికి కీలకమైన విద్యుత్ పంపిణీ సంస్థల రెగ్యులేటరీ ఆస్తిని కొన్ని దశాబ్దాలుగా లిక్విడేట్ చేయడానికి, రద్దు చేయడానికి ఇఆర్‌సిలు ఉద్దేశ పూర్వకంగానే అనుమతించడం లేదని, కాబట్టి ఈ రెగ్యులేటరీ ఆస్తి అనేది గాలి బుడగలాగా మారిందని, దీంతో ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లితోందని, విద్యుత్ కోసం ఎక్కువ ధరల భారాన్ని వారు భరించాల్సి వస్తోందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇక నుంచి భవిష్యత్‌లో విద్యుత్ పంపిణీ సంస్థల రెగ్యులేటరీ ఆస్తిని మూడేళ్లలోపు రద్దు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం ఉన్న రెగ్యులేటరీ ఆస్తులను గరిష్టంగా ఏడేళ్లలోపు లిక్విడేట్ చేయాలని స్పష్టం చేసింది.

జాతీయ అవార్డులకు పక్షపాత చెదలు

సినీ రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా ఏటేటా అందించే జాతీయ సినిమా అవార్డు (ఈ ఏడాది 71వ)ల్లో ఈ ఏడాది ప్రకటించిన సెలబ్రెటీల పేర్లు సినీ ప్రపంచంలో పెద్ద చర్చకు దారితీశాయి. ఎంపికైన కొందరు సెలబ్రిటీల ప్రతిభ, ఎంపిక విధానం, నిర్ణయ కమిటీ సభ్యుల తీరుపైనా పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. అవాస్తవాలను ప్రచారం చేస్తూ కేరళలో మతకల్లోలాలు సృష్టించేలా నిర్మించిన 'ది కేరళ స్టోరీ' సినిమాకు ఉత్తమ దర్శకుడు, ఉత్తమ ఛాయాగ్రహణం అవార్డులు రావడంపై విమర్శలు వచ్చాయి. కొందరు దీనిని రాజకీయంగా ప్రేరేపిత అవార్డుల ఎంపికగా భావిస్తున్నారు. ఎంపిక అత్యంత లోపభూయిష్టంగా జరిగిందనే తేటతెల్లమవుతోంది. ప్రతిభను పక్కన పెట్టేసి భారీ బడ్జెట్ చిత్రాల పేరుతో అందులో నటించిన వారికి అవార్డులు ప్రకటించటం తీవ్ర దుమారాన్నే లేపింది. జవాన్‌లో షారూక్‌ఖాన్, 12త్ ఫెయిల్‌లో విక్రాంత్‌మస్సేకు జాతీయ ఉత్తమ నటుడు అవార్డులు వచ్చాయి. షారూక్‌ఖాన్ గతంలో మంచి నటన కనబరిచిన సినిమాలను వదిలేసి ఇప్పుడు 'జవాన్' సినిమాలో నటనకు అవార్డు ఇవ్వడంపైనా అనుమానాలు వ్యక్తమయ్యాయి. 'ది గోట్‌లైఫ్' సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటన నచ్చలేదా అంటూ దక్షిణాది సినీరంగ ప్రముఖులు తీవ్ర విమర్శలు సైతం చేశారు. షారూక్‌ఖాన్‌తో కలిసి గతంలో 'స్వదేశ్' సినిమా తీసిన దర్శకుడు అశుతోష్ గోవారికర్ ఈ జ్యూరీలో కీలక సభ్యుడు కావటంతోనే ఉత్తమ నటుడు, నటి అవార్డు అక్కడి వారికి ఇచ్చినట్లు నెటిజన్లు కామెంట్లు చేశారు. 2018లో మలయాళ చిత్రసీమలో ఇలాంటి ఘటన ఎదురై నాడు ఫహాద్ ఫాజిల్, పార్వతి తిరువోతు తమకు ప్రకటించిన అవార్డులను స్వీకరించకుండా బాయ్‌కాట్ చేశారు.



మలయాళంలో 'ఆడు జీవితం' చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ జీవించిన లైఫ్‌టైమ్ టైమ్ పెర్ఫామెన్స్‌కు కూడా బహుమతుల జాబితాలో లేకపోవడం ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసింది.



వయస్సే ప్రామాణికమా?

దక్షిణాది సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేని నటి ఊర్వశి. 1980లలో కథానాయికగా తెలుగు, తమిళ, మలయాళ సినీ ఇండస్ట్రీలలో పెద్ద స్టార్లతో వరుస సినిమాలు చేసి అగ్ర కథానాయికగా ఓ వెలుగు వెలిగారు. ఇప్పుడు సహాయ నటిగా అన్ని భాషల్లోనూ నటిస్తూ బిజీగా ఉన్నారు. గత సంవత్సరం పార్వతి తిరువోతుతో కలిసి లీడ్‌రోల్స్‌లో నటించిన మలయాళ చిత్రం 'ఉళ్ళోళుక్కు' చిత్రం సంచలన విజయాన్ని సాధించింది. ఓటీటీలోనూ మంచి ఆదరణను దక్కించుకుంది. ఉత్తమ చిత్రంగా ఎంపిక చేసిన జ్యూరీ ఇందులో లీడ్‌రోల్లో నటించిన ఊర్వశికి ఉత్తమ సహాయ నటి అవార్డును ప్రకటించింది. ఈ అవార్డుల తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఉళ్ళోళుక్కు' చిత్రంలో నా నటనను ఏ పద్ధతిలో కొలిచారు? సపోర్టింగ్ అనే కేటగిరిలో నాకు ఎలా అవార్డు ప్రకటించారు. ఆ సినిమాలో మరో నటి, నేను కలిసి లీడ్ రోల్స్ చేశాం. వయసు పైబడితే సహాయనటిగా పరిగణిస్తారా?. మీరు అవార్డు ప్రకటించగానే వచ్చి సైలెంట్‌గా తీసుకోడానికి అదేమీ పెన్షన్ కాదు' అంటూ అవార్డుల ఎంపిక కమిటీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

2005లో 'అచ్చువింటే అమ్మ' అనే సినిమాలోనూ ఊర్వశి ప్రధాన పాత్రలో నటించారు. దానికి 2006లో జాతీయ ఉత్తమ సహాయ నటి అవార్డు ప్రకటించారనీ, అవార్డుల ఎంపికలో రాజకీయ జోక్యం కారణంగానే ఇలా చేస్తున్నారని విమర్శించారు. కథానాయికగా నటిస్తే సహాయ నటిగా అవార్డు ఎలా ఇస్తారంటూ అప్పుడే ఆమె అవార్డుల తీరును వ్యతిరేకించారు. సరిగ్గా 20 ఏళ్ల తర్వాత అదే తరహా ఎంపికను ఆమె ఎదుర్కొనటం బాధాకరం. విజయ రాఘవన్‌కు బెస్ట్ యాక్టర్ సపోర్టింగ్ రోల్ అవార్డు అవార్డు ఇవ్వడం ఏమిటని ఊర్వశి ప్రశ్నించారు. 'ఆడుజీవితం' లాంటి అద్భుతమైన సినిమాకు ఎలాంటి అవార్డు రాకపోవడం వివక్ష కాదా? అని ప్రశ్నించారు.

అవార్డులపై మతోన్మాద ముద్ర

ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం, నిర్బంధాలకు గురిచేయడం బీజేపీ ప్రభుత్వ పాలనలో నిత్యకృత్యమయ్యాయి. గడిచిన 12 ఏళ్లలో అభ్యుదయ భావాలను పెంచే సినిమాల్లోని విషయాలకు కత్తెరలు వేయటం, సీన్లకు కట్ చేయటం, సెన్సార్ ఆమోదాలకు రాకుండా చేయటం చేస్తున్నారు. మతోన్మాదాన్ని వ్యతిరేకించే నటులు, దర్శకులపై కేసులు పెట్టేందుకు కూడా వెనుకాడటం లేదు. ప్రపంచం మెచ్చి గర్వించిన దర్శకురాలు పాయల్ కపాడియా నిర్మించిన చిత్రం 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్'ను మనదేశంలో విడుదల చేయకుండా కేంద్రప్రభుత్వం అనేక ఆటంకాలు కల్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జాతీయ చలనచిత్ర అవార్డులకు రాజకీయ చెదలు పట్టాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

గాజా ఆక్రమణ వద్దంటూ
నిరసనల హోరు

- నెతన్యాహు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న ఇజ్రాయిల్ ప్రజలు
- యుద్ధాన్ని ఆపి, బందీలను విడిపించాలని డిమాండ్

టెల్ అవీవ్ : బెంజిమెన్ నెతన్యాహు గాజాను స్వాధీనం చేసుకుంటామన్న ప్రకటనపై ఇజ్రాయిల్ ప్రజలే భగ్గుమంటున్నారు. ప్రధాని నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వేలాదిమంది ప్రజలు టెల్ అవీవ్ వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. నగర ప్రధాన రహదారైన అయలోన్ హైవేను దిగ్బంధించారు. దేశ జెండాలను ప్రదర్శిస్తూ, రోడ్డుపై మంటలు రాజేసి "చాలు యుద్ధాన్ని ఆపండి, బందీలను విడిపించండి " అని నినదించారు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జెరుసలెం, హైఫా, బీట్‌షేన్, నహారియా, కిర్యత్ గాట్, రాన్నా, గోమె జంక్షన్, నెవె ఇలాన్, కార్మియల్, మరికొన్ని ప్రాంతాలకు నిరసనలు విస్తరించాయి. హోస్టేజ్ స్క్వేర్ ప్రాంతంలో జరిగిన నిరసనలో హమాస్ చెరలో ఉన్న బందీల కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రకటనతో వారి ప్రాణాలకు హాని కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం తక్షణమే ఆపి హమాస్‌తో ఒప్పందం చేసుకుని బందీలను విడిపించాలని వారు కోరారు. ఇజ్రాయిల్ మీడియా కథనాల ప్రకారం టెల్ అవీవ్ నిరసనల్లో సుమారు లక్ష మంది పాల్గొన్నారు. గాజాపై దాడులు ప్రారంభమైన తరువాత ఇదే పెద్ద ఆందోళన. అంతర్జాతీయంగా అనేక దేశాలు పాలస్తీనాకు మద్దతుగా నిలిచాయి. ఇటీవలే బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలు పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని ప్రకటించాయి.



గాజా ఆక్రమణ వద్దని టెల్ అవీవ్‌లో ఆందోళన చేస్తున్న ఇజ్రాయిల్ వాసులు

17న సమ్మె

గాజా ఆక్రమణకు వ్యతిరేకంగా బాధిత, సైనికుల కుటుంబాలు, అక్టోబర్ కౌన్సిల్ సభ్యులు ఈ నెల 17న సమ్మెకు పిలుపునిచ్చారు. టెల్ అవీవ్‌లోని కిర్యా సైనిక స్థావరం వద్ద జరిగిన పత్రికా సమావేశంలో వారు సమ్మెను ప్రకటించారు. గాజా స్వాదీన ప్రకటన బందీలను మరింత ప్రమాదంలో పడేస్తుందని, అనేకమంది సైనికులు ప్రాణాలు కోల్పోతారని, గాజాలో మానవతా సంక్షోభం మరింత పెరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 17న సమ్మెలో అందరూ పాల్గోవాలని, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, కార్మికులు, ఇతర శ్రామికులు పనిని బహిష్కరించాలని వారు కోరారు. ఈ సమ్మెకు వామపక్ష, ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలిపాయి.

ప్రపంచవ్యాప్తంగా ర్యాలీలు

గాజాపై ఇజ్రాయిల్ మారణ హోమాన్ని నిరసిస్తూ ఆదివారం ప్రపంచవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు హోరె త్తాయి. పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా అనేక మంది ప్రదర్శనలు చేశారు. ఇజ్రాయిల్ విధించిన ఆంక్షలతో ఆకలి మరణాలు సంభవిస్తున్నాయని, శరణార్థులతోపాటు అమాయకుల బాంబు దాడులతో తెగబడుతున్న తీరుపై ప్రదర్శనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లండన్‌లో, పాలస్తీనా యాక్షన్ సమూహాన్ని నిషేధించాలనే బ్రిటిష్ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా శనివారం జరిగిన నిరసనలో 466 మందికి పైగా అరెస్టు చేసినట్టు మెట్రోపాలిటన్ పోలీసులు తెలిపారు. టర్కి దేశం ఇస్తాం బుల్‌లో.. వేలాది మంది నిరసనకారులు గాజా స్ట్రిప్‌లోకి మరింత సహాయాన్ని అనుమతించాలని డిమాండ్ చేశారు.

మానవతా సంక్షోభాన్ని అంతం చేయడానికి అంతర్జాతీయ సమాజం అత్యవసర చర్య తీసుకోవాలని కోరారు. నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్‌లో, స్పెయిన్ రాజధాని మాడ్రిడ్, స్విట్టర్లాండ్‌లోని జెనీవాలోనూ, మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో కూడా గాజాలో బాధపడుతున్న వారికి మద్దతుగా పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. గాజాకు తక్షణ సహాయం అందించాలని, యుద్ధాన్ని ముగించాలని వారు డిమాండ్ చేశారు.



ఇజ్రాయిల్ దాష్టీకంపై ఆమ్‌స్టర్‌డామ్‌లో నిరసన తెలుపుతున్న నెదర్లాండ్స్ ప్రజలు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68